RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 92 | గురువారం, మే 9, 2024 | పేజీలు : 4

## తెలంగాణలో మరో 5 రోజుల పాటు వర్షాలు


హైదరాబాద్: తెలంగాణలో మరో 5 రోజుల పాటు వర్షాలు పడనున్నాయి.రేపటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. బుధవారం సాయంత్రం హైదరాబాద్ లో మోస్తర నుంచి భారీ వర్షం పడే సూచనలు ఉన్నాయని హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పింది. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. అకాల వర్షాలతో రైతులకు భారీగా పంటనష్టం జరిగింది. ఇక, హైదరాబాద్ లో కుండపోత వాన పడింది. వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయం కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## రాష్ట్ర ప్రతిష్ట, హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతీసిందు : కేసీఆర్



హైదరాబాద్: హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుస్తోందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని దుండిగల్ రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరచేతిలో వైకుంఠం చూపించి.. మనల్ని మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిందని.. ఒక్క ఉచిత బస్సు మినహా ఏది కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ఐదు నెలల్లోనే రాష్ట్రం ఇంత ఆగమాగం ఎందుకయ్యిందని... తల, తోక లేకుండా ఈ ప్రభుత్వం అనేక రకాలుగా తెలంగాణను నష్టపరుస్తుందని మండిపడ్డారు. కరెంటు కోతల కారణంగా హైదరాబాద్‌లో పరిశ్రమలు వెళ్లిపోయాయని, ఐటీ దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం బ్రాండ్ ఇమేజ్ అంతర్జాతీయంగా పడగొట్టే దుర్మార్గ చర్యలకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్నది. పరిశ్రమలు తరలిపోతున్నయ్. ఐటీరంగం కుదేలవుతున్నది. నేను ముఖ్యమంత్రి ఉండే రోజు పవర్ ఐలాండ్‌గా మార్చాను. న్యూయార్క్‌లో, లండన్‌లో కరెంటు పోయినా.. హైదరాబాద్‌లో కరెంటుపోకుంట చేసిన. రాష్ట్రంలో అన్ని జనరేటింగ్ స్టేషన్లలో నేషనల్ గ్రిడ్‌లో లింక్ చేసినం. నిన్న కొద్దిపాటి వాన పడితే ఆరు, ఎనిమిది, పదిగంటలు కరెంటు పోతున్నది' అన్నారు. తెలంగాణ కోసం పేలుగు తెగేదాక కొట్లాడే ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్ పార్టీ. రేపు పార్లమెంట్‌లో మనోళ్లు డజన్ మంది ఉంటేనే ఖచ్చితంగా తెలంగాణ హక్కులు కాపాడుతరు అని అన్నారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చి ఈ దేశంలో పది సంవత్సరాలు గడుస్తున్నది. మోదీ 150 నినాదాలు ఇచ్చిండు. నరేంద్ర మోదీ ఆ రోజు చెప్పిండు. బీజేపీని గెలిపిస్తే విదేశాల్లోని నల్లధనం తెచ్చి ప్రతి ఇంటికి రూ.15లక్షలు ఇస్తమన్నరు. మరి మీకు వచ్చినయా? రాలేదా? ఈటల రాజేందర్ చెబుతున్నడు. మరి ఏం చేయాలి? 3లక్షల మెజారిటీతోని రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి' అని పిలుపునిచ్చారు. 'బేటీ పడావో బేటీ బచావో ఏమన్నా జరిగిందా? వికసిత్ భారత్‌లో ఏమైనా జరిగిందా? అమృత్ కాల్ వచ్చిందా? అచ్చేదిన్ వచ్చినయా? అంతా వట్టి ట్రాషే ఏమీ లేదు. మోదీ పాలనలో విదేశీ మారక నిల్వలు పడిపోయాయి. దేశ ప్రతిష్ట మంటగలిసిపోతున్నది. మొన్న అరవింద్ కేజ్రీవాల్, కవితను అరెస్టు చేస్తే.. అమెరికా దేశం సైతం తమ నిరసన వ్యక్తం చేసింది. అంతర్జాతీయంగా విశ్వగురువు అని ప్రచారం చేసుకునే మోదీ.. విశ్వం మొత్తం మీద దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నడు. హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీరంగాన్ని ఎంత అభివృద్ధి చేసినమో మీకు తెలుసు. ఐటీఐఆర్ మనకు హైదరాబాద్‌కు చట్టం ప్రకారం ఉండేది. దాన్ని కూడా తీసేశాడు. ఐటీఐఆర్ తీసుకొనిపోయాడు. తెలంగాణకు వచ్చిన ఏడు మండలాలు.. మనకు 400మెగావాట్ల పవర్ ఇచ్చే సీలేరు పవర్ ప్రాజెక్టు ఆంధ్రాకు అప్పగించాడు. మళ్లీ ఇప్పుడు ఏమంటున్నడు. మీ గోదావరి జలాలు, కృష్ణా జలాలు తీసుకుపోయి కర్ణాటక, తమిళనాడుకు ఇస్తామంటున్నడు. ఒప్పుకుందామా? యుద్ధం చేద్దామా? మన కృష్ణ, మన గోదావరి మనకే దక్కాలంటే లక్ష్మారెడ్డిలాంటి వీరులు గెలిస్తేనే పార్లమెంట్‌లో గొంతుపట్టుకుంటరు' అన్నారు.

## కాంగ్రెస్ ఓవర్సీస్ చైర్మన్ పదవికి శ్యామ్ పిట్రోడా రాజీనామా...!



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయన రాజీనామాను ఆమోదించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తన సోషల్ మీడియా ఖాతా ట్విట్టర్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ దీనిపై సమాచారం ఇచ్చారు. తన ఇష్టానుసారం శామ్ పిట్రోడా ఈ పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం తెలిపారు. ఇటీవల పిట్రోడా చేసినటువంటి వ్యాఖ్యలు వివాదస్పదంగా మారాయి. భారతదేశంలోని భిన్నత్వంపై శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారం రేపాయి. భారత్ లో భిన్నత్వంలో ఏకత్వం ఉంటుంది. తూర్పు భారతీయులు చైనీస్ లాగా, దక్షిణ భారతీయులు ఆఫ్రికన్ ప్రజలలా కనిపిస్తారని చెప్పారు. అదేవిధంగా ఉత్తరాది వాళ్లు శ్వేతజాతీయుల మాదిరిగా కనిపిస్తారని శ్యామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో హాట్ కామెంట్స్ చేశారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ సైతం ఎక్స్ లో స్పందించారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. వరంగల్ సభలో, ఏపీ రాజంపేట సభలో ప్రధాని నరేంద్ర మోడీ శ్యామ్ పిట్రోడా వ్యాఖ్యలను ప్రస్తావించడం గమనార్హం. శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాది ప్రజలు ఆఫ్రికన్లలా ఉంటారని గాంధీ కుటుంబానికి సన్నిహితంగా ఉండే వ్యక్తి అంటున్నారని విమర్శించారు. దీన్ని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక సీఎంలు సమర్థిస్తారా ? అని ప్రశ్నించారు. మహారాష్ట్రలోని థాకరే వారసులుగా చెప్పుకునే వాళ్లు దీన్ని అంగీకరిస్తారా? అని మోదీ నిలదీశారు.

## ప్రధాని మోడీ కుర్చీ కంపిస్తోంది: మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ: మూడు దశల లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ కుర్చీ కంపిస్తోందని, ఆయన తన సొంత మిత్రులైన అదానీ, అంబానీలపైనే దాడి చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. దీన్ని బట్టే ఎన్నికల ఫలితాల నిజమైన సరళి తెఉస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. కాలం మారుతోంది.



మిత్రులు ఇక మిత్రులు కారు. మూడు దశల ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ నేడు తన సొంత మిత్రులపైనే దాడి చేయడం ప్రారంభించారు. మోడీ కుర్చీ కంపిస్తోందని స్పష్టంగా కనపడుతోంది. ఇదే ఎన్నికల ఫలితాల నిజమైన సరళి అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఖర్గే వ్యాఖ్యానించారు. గడచిన ఐదేళ్లుగా కాంగ్రెస్ యువరాజు పదే పదే ప్రస్తావిస్తున్న అంబానీ, అదానీ పేర్లను కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు ఆపేసిందో వివరించాలని తెలంగాణలో ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ.. ప్రధాని మోడీ డిమాండ్ చేశారు. ఆ ఇద్దరితో కాంగ్రెస్ ఏదో ఒప్పందం కుదుర్చుకుందని ఆయన ఆరోపించారు.

## మోడీ మళ్లీ గెలిస్తే... ఎన్నికలు ఉండవు



హైదరాబాద్: బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ బస్సు యాత్రతో వచ్చేది లేదు సచ్చేది లేదని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు. జూన్ 4 తరువాత తెలంగాణ భవన్ ను మూసివేస్తారని, కెసిఆర్ దొంగ దీక్షలతో మళ్లీ డ్రామాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కెసిఆర్ సచ్చిన పాములాంటోడన్నారు. బుధవారం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు చాలా కీలకమని, రాష్ట్రంలో కాంగ్రెస్ 14, 15 సీట్లు పక్కగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓట్ల కోసం బిజెపి చిల్లర రాజకీయాలు చేస్తోందని, రిజర్వేషన్లపై మోడీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ముస్లిం రిజర్వేషన్లు తిసివేస్తామని బిజెపి వారు మత కలహాలు రేపుతున్నారని దుయ్యబట్టారు. మోడీ ఇస్తామన్న హామీలు ఇప్పటివరకు ఇవ్వలేదని, జిఎస్‌టి పేరుతో భారీ మోసం జరుగుతోందని, పదేండ్లు ప్రధాని ఉండి రాముడి పేరుతో ఓట్లు అడుక్కునే పరిస్థితి వచ్చిందని, ఎన్‌డిఎ కూటమి తమ టార్గెట్ అని, మళ్లీ మోడీ ప్రధాని అయితే దేశంలో ఎన్నికలు ఉండవని, రష్యా, చైనా లాగా భారత్ మారిపోతుందని హెచ్చరించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు.

## ఆ వ్యాఖ్యలు చేసినందుకు అద్దంకి దయాకర్‌పై... కేసు నమోదు

నిర్మల్: ఆదిలాబాద్ సభలో శ్రీరాముడు, హిందువులపై కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ వివాదస్పద వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై బిజెపి నేతలు పోలీసులకు





ఫిర్యాదు చేశారు. నిర్మల్ పోలీస్ స్టేషన్‌లో ఐపిసి సెక్షన్ 504, 505/2 కింద అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ సభలో అద్దంకి దయాకర్ హిందు దేవుళ్లపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బిజెపి, ఇతర హిందువులు రాముని వారసులు అని చెప్పుకుంటున్నారని, మీరు ఏవిదంగా రాముడి వారసులు అవుతారని ప్రశ్నించారు. రాముడు మీకు చిన్నాయన, సీత మీకు చిన్నమ్మన అని అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో హిందూ సంఘాలు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. తన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని అద్దంకి దయాకర్ ఓ వీడియోను విడుదల చేసిన విషయం తెలిసిందే.

## దేశం సుభిక్షంగా ఉండాలంటే... కాంగ్రెస్ గెలవాలి



**నిర్మల్ :** దేశం సుభిక్షంగా ఉండాలంటే అన్ని వర్గాల ప్రజల కోసం పాటుపడేది కాంగ్రెస్ పార్టీయేనని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పేర్కొన్నారు. నిర్మల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న బట్టి విక్రమార్క విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న పోడు భూముల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్ పార్టీఅని. మరోమారు బీజేపీకి అధికారం ఇస్తే దేశం విచ్చినం కావడం తథ్యమని ఆయన చెప్పారు. అదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ఓ పేద మహిళ ఆదివాసి బిడ్డ ఆత్రం సుగుణకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి ఎన్నిక బరిలో నిలబెట్టిందని.. అందుకు జిల్లాలోని ప్రజలందరూ ఆమెకు మద్దతు పలికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జిల్లాలో కాంగ్రెస్ హయాంలోనే మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించిందని గుర్తు చేశారు. త్రివేణి సంగమం పులిమడుగు పనులను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేసి.. నీటిని డిస్ట్రిబ్యూటర్ల ద్వారా పంపిణీ చేస్తామని రైతులకు బాసటగా ఉంటామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరణి తీసుకువచ్చి పేదల భూములను లాక్కున్నారని ధరణిలోని లోటుపోట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కై చీకటి రాజకీయం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాలని ఉద్దేశం లేదని. కులగలన పూర్తి అయితే ఆ పార్టీకి నూకలు చెల్లుతాయని గుర్తించింది... అందుకే వెనుకడుగు వేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క, ఖానాపూర్ శాసనసభ్యులు వేడుమ బొజ్జు, మాజీ మంత్రి ఆల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, డిసిసి అధ్యక్షులు కే శ్రీహర్రావు, మాజీ ఎమ్మెల్యేలు రేఖ నాయక్, కోనేరు కోనప్ప తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# కుశల ప్రశ్నలుగా మోడీ ఇంటర్వ్యూలు

ప్రధాని పీఠంపై ఉన్న వ్యక్తిని కారణం లేకుండా ఎవరూ నిందించరు. ఆ నిందను నివృత్తి చేయవలసిన బాధ్యత ఆయనపై ఉంటుంది. తాను తప్పే చేయను అన్న అహంభావం ఆయన మాటల్లో ఉంది. రాముణ్ణి, కృష్ణుణ్ణి వదలని వారు మోడీని వదులుతారా అని దానికి హిందూ మనోభావాన్ని జోడించారు. ఒక వైపు మోడీకి కీర్తించడం, మరో వైపు కాంగ్రెస్ పార్టీని, నేత లను విమర్శించే కోణంలోనే ఈ ఇంటర్వ్యూలు సాగాయి. విలేకరులు అడిగే ప్రశ్నల్లోనే కాంగ్రెస్‌పై వ్యంగ్యముంది. ఒకే దెబ్బతో రాహుల్ గాంధీ దేశంలోని పేదరికాన్ని పారద్రోలుతానంటున్నారు. అదెలా సాధ్య మని ఒక ప్రశ్న. అరవై ఏళ్లలో సాధించనిది చిటికెలో చేస్తారా అని ప్రధాని నవ్వు. ముఖ్యమంత్రిగా తన గుజరాత్ పాలనను పిట్ట కథలు చెబుతుంటే ఒక్కరూ ఆయన్ని వర్తమానానికి తెచ్చే ప్రయత్నం చేయలేదు. హిందూ దినపత్రికలో 5వ తేదీ నాడు సౌమ్యదీప్ సిన్హా ఒక కార్టూన్ వేశారు. 'ఇప్పుడు నేను మీ పనిని సులభం చేశాను. ప్రశ్నలు వేసే అవసరం లేకుండా నేను చెప్పింది వింటే చాలు' అని ప్రధాని మోడీ విలేకరులతో అంటున్న ట్లు అందులో ఉంది. ఈ మధ్య ఒక తెలుగు టివి ఛానల్, ఒక తెలుగు దినపత్రిక మోడీని విడివిడిగా ఇంటర్వ్యూ చేశాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ఆ కార్టూన్ వేశారో లేదో కానీ ఈ రెండు ఇంటర్వ్యూలకు ఆ కార్టూన్ వ్యాఖ్య సరిగ్గా సరిపోతుంది. ఢిల్లీలో ప్రధాని మోడీ నివాసానికి తొలుత టివి ఛానల్‌కు చెందిన అయిదుగురు వెళ్లి సుమారు గంటన్నర సేపు ఆయనతో రౌండ్ టేబుల్ చర్చను సాగించారు. ఆ తర్వాత మోడీ ఇంటికి తెలుగు దినపత్రికకు చెందిన ఇద్దరు వెళ్లి కొన్ని ప్రశ్నలు వేసి ఆయన జవాబులు రాసుకొచ్చారు. టివి ఛానల్ మాత్రం ఇది ఎవరూ సాధించని ఘనకార్యమని జబ్బలు చరుచుకుంది. ఈ టివి ఛానల్ బిజెపికి సమీప వ్యక్తికి చెందినది. ఆయనకు బిజెపి రాజ్యసభలో స్థానం కల్పిస్తామన్నా తెలంగాణ ప్రభుత్వంతో తమ వ్యాపారాలకు ఇబ్బంది రావద్దని తలచి ఆ ఆఫర్‌ను అందుకోలేదు. ఇక దినపత్రిక విషయానికొస్తే దాని యజమాని ప్రధాని మోడీని ఢిల్లీలో కలిశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు హైదరాబాదు వచ్చినపుడు ఆ పత్రికాధిపతి ఇంటికెళ్లారు. ఇలా ఆ రెండు ప్రసార మాధ్యమాలకు మోడీతో, బిజెపితో సత్సంబంధాలున్నాయి. ఎప్పుడూ పాత్రికేయులను దూరంగా ఉంచే మోడీకి ఇప్పుడు తన రిమోట్ సంస్థల కోసం ఈ ఇంటర్వ్యూలకు సిద్ధపడ్డారు. ప్రశ్నలన్నీ మోడీ గొప్పను, విపక్షాల ఎద్దేవాను లక్ష్యం చేసుకున్నాయి. వాటికీ మోడీ మరింత మసాలా అద్ది తన పదేళ్ల పాలన కన్నా ముందు అంతా శూన్యమే అన్నట్లు సుదీర్ఘ వివరణలిచ్చారు. ప్రతి జవాబులోను మోడీ తనకు తాను ఈ దేశానికి, ప్రజలకు లభించిన గొప్ప తత్వవేత్తగా, సంఘ సంస్కర్తగా అభివర్ణించుకున్నారు. దానిని అంగీకరిస్తున్నట్లు చిరునవ్వులతో తలలు అందించడమే పాత్రికేయుల పనిగా సాగింది. టివి ఛానల్ వారి తొలి ప్రశ్న పూర్తి కాకుండానే తన దిన చర్య ఇలా మొదలవుతుందో చెబుతూ మోడీ తన భాషణ చాతుర్యంతో అందరినీ తన్మయత్వంలోకి తీసికెళ్లారు. తాము ఆయన్ని ప్రశ్నించడానికి వచ్చామన్న విషయం మరిచిపోయి వాళ్లు మోడీకి జై కొట్టారు. అంతా ప్రీ ప్లాన్డ్ డ్రామాలా అనిపిస్తుంది. మీరు అభివృద్ధి చేసినా విపక్షాలు మిమ్మల్ని నిందిస్తుంటాయి అని ప్రశ్నిస్తే జవాబుగా మోడీ నవ్వుతూ డిక్షనరీలో ఉన్న తిట్లన్నీ అయిపోయి వారు కొత్త తిట్లు సృష్టించే అవసరం వచ్చింది అన్నారు. ఇన్ని తిట్లు పడిన నేతల్లో వరల్డ్ రికార్డ్ తనదే అన్నారు. శివుడు గళంలో గరళం దాచుకున్నట్లు తాను వాటిని మింగకుండా గొంతులో ఉంచానన్నారు. మోడీని తప్పుపట్టడమే తప్పు అన్నట్లుగా ఉంది ఆ సమర్థన. ప్రధాని పీఠంపై ఉన్న వ్యక్తిని కారణం లేకుండా ఎవరూ నిందించరు. ఆ నిందను నివృత్తి చేయవలసిన బాధ్యత ఆయనపై ఉంటుంది. తాను తప్పే చేయను అన్న అహంభావం ఆయన మాటల్లో ఉంది. రాముణ్ణి, కృష్ణుణ్ణి వదలని వారు మోడీని వదులుతారా అని దానికి హిందూ మనోభావాన్ని జోడించారు. ఒక వైపు మోడీకి కీర్తించడం, మరో వైపు కాంగ్రెస్ పార్టీని, నేతలను విమర్శించే కోణంలోనే ఈ ఇంటర్వ్యూలు సాగాయి. విలేకరులు అడిగే ప్రశ్నల్లోనే కాంగ్రెస్‌పై వ్యంగ్యముంది. ఒకే దెబ్బతో రాహుల్ గాంధీ దేశంలోని పేదరికాన్ని పారద్రోలుతానంటున్నారు. అదెలా సాధ్యమని ఒక ప్రశ్న. అరవై ఏళ్లలో సాధించనిది చిటికెలో చేస్తారా అని ప్రధాని నవ్వు. ముఖ్యమంత్రిగా తన గుజరాత్ పాలనను పిట్ట కథలు చెబుతుంటే ఒక్కరూ ఆయన్ని వర్తమానానికి తెచ్చే ప్రయత్నం చేయలేదు. 2002 నాటి గుజరాత్ అల్లర్లకు ప్రత్యక్ష సాక్షి అయిన ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ జైల్లో ఎందుకున్నారు అని ఎవరూ ప్రశ్నించలేదు. పదేళ్ల పాలన ట్రైలరే. అసలు సినిమా ముందుంది అని కాంగ్రెస్ వాళ్ళను నిద్రకు దూరం చేశారు అని ఒకరి ప్రశ్న. ట్రైలర్ కాలంలో అక్టోబర్ 2020లో హత్రాస్‌లో జరిగిన గ్యాంగ్ రేప్ కవరేజికి వెళ్లిన రిపోర్టర్ సిద్ధిఖీ కప్పన్‌ను ఉపా కేసు పెట్టి రెండేళ్లు జైల్లో ఎందుకు ఉంచారు అని సాటి విలేకరిగా ఒక్కరూ ప్రశ్నించలేదు. మణిపూర్‌లో ఏం జరుగుతోందని ప్రశ్నించే ధైర్యం ఎవరూ చేయలేదు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని 'భ్రమ' ప్రజల్లో ఉంది అని ఓ ప్రశ్న. దాన్ని భ్రమగా విలేకరి ముద్ర వేయడం వింతగా ఉంది. గుజరాత్‌లో సిఎంగా ఉన్నపుడు రాజ్యాంగం 60 ఏళ్ల సమారోహంగా రాజ్యాంగ ప్రతిని ఏనుగుపై ఊరేగించానని, అదీ తనకు రాజ్యాంగంపైనున్న గౌరవమని మోడీ అన్నారు. 1976లో 42వ సవరణగా రాజ్యాంగ పీఠికలో చేర్చిన 'సెక్యులర్' అన్న పదాన్ని తీసేస్తామని రాజ్‌నాథ్ సింగ్ అంటున్న విషయం ప్రస్తావనకు రాలేదు. సెక్యులర్ అన్నపదం బిజెపికి ఎందుకు ఇష్టం లేదో అడిగేదెవరు? కాంగ్రెస్‌లో యువ నేతలంతా వెళ్ళిపోయి మావోవాదులు అందులో చేరారని అందుకే ఉన్నవారి ఆస్తులు లాక్కొని పంచుతామని అంటున్నారని మోడీ అన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న మావోవాదుల పేర్లు చెబితే బాగుండేది. వెస్ట్ బెంగాల్ గొప్పతనాన్ని ఎర్ర పార్టీలు, తృణమూల్ కాంగ్రెస్ చెడగొట్టాయి. దాని పూర్వవైభవాన్ని తిరిగి తెస్తామన్నారు మోడీ. ప్రజలు ఇష్టపడి ఎన్నుకుంటేనే ఎవరైనా పాలించేది.

# ఈటల గెలుపే లక్ష్యంగా ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి కార్యకర్తలు



**శామీర్‌పేట, (గరుడ వార్త) :** భారతీయ జనతా పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా బిజెపి నాయకుల ముమ్మర ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ భారీ మెజారిటీతో తెలుపు పొందుతారని చెప్పారు. మూడోసారి మోడీ ప్రధానిగా చేయడమే ప్రజలు చూస్తున్నారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ గాలి వీస్తోందని, ప్రజలంతా బీజేపీకి పట్టం కట్టెందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మినీ ఇండియాగా పిలవబడే అతి పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంట్ బరి నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలంతా ముందుకొస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుదర్శన్, రమేష్ యాదవ్, పవన్ గౌడ్, శివ, కుమార్, రాజు, రాములు, విష్ణు, చందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ముమ్మర ప్రచారం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం. బుధవారం మండల కేంద్రం శామీర్ పేటలో మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానని చెప్పిన ఒక్క హామీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచుతారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయ లేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డి ని గెలిపిస్తే మన నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ వెంకట్ రెడ్డి, ఐలయ్య యాదవ్, భూమి రెడ్డి, వెంకటేష్, నవీన్, నర్సింగ్, మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రచార జోరులో కాంగ్రెస్ నాయకుల



**శామీర్ పేట, (గరుడ వార్త) :** సునీత మహేందర్ రెడ్డి గెలిపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితోనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కేవలం మూడు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ సునీతమహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి సుపరిచితురాలని, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడ్డా, అమిత్ మాల్వీయకు కర్నాటక పోలీసుల సమన్లు

బెంగళూరు: ముస్లింలను, కాంగ్రెస్ పార్టీని లక్షంగా చేసుకుని బిజెపి కర్నాటక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్టు చేసిన అభ్యంతరకర ట్వీట్‌కు సంబంధించి బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, బిజెపి ఐటి సెల్ చీఫ్ అమిత్ మాల్వీయకు కర్నాటక పోలీసులు బుధవారం సమన్లు జారీచేశారు. 7 రోజుల్లోపల బెంగళూరులోని హై గ్రౌండ్స్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని ఆ సమన్లలో పోలీసులు ఆదేశించారు. బిజెపి నాయకులపై సమన్లు జారీ చేయడంపై కర్నాటక హెూం మంత్రి జి పరమేశ్వరను విలేకరులు ప్రశ్నించగా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు ఉంటాయని చెప్పారు. ఒకసారి వారు(నడ్డా, మాల్వీయ) వచ్చి తమ వాంగ్మూలాన్ని ఇచ్చి, తమ ప్రకటనను సమర్థించుకుంటే తదుపరి చర్యల గురించి పరిశీలిస్తామని ఆయన తెలిపారు. బిజెపి కర్నాటక విభాగం షేర్ చేసిన పోస్టును వెంటనే తొలగించాలంటూ ఎక్స్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశించిన మరుసటి రోజే ఈ పరిణామం



చోటు చేసుకోవడం గమనార్హం. రిజర్వేషన్ రాజకీయాలలో ముస్లింల పట్ల కాంగ్రెస్ అనుకూలంఆ వ్యవహరిస్తోందని తెలియచేసే ఒక వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసినందుకు కర్నాటక బిజెపి అధ్యక్షుడు బివై విజయేంద్రపై ఇప్పటికే కర్నాటక పోలీసులు ఒక ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల కన్నా ఎక్కువ నిధులను ముస్లింలకు ఇస్తున్నట్లు చూపించే ఒక వీడియోను బిజెపి కర్నాటక శాఖ ఎక్స్‌లో పోస్టు చేసింది.

# అయోధ్య రామాలయానికి బాబ్రీ తాళం వేస్తారు: అమిత్ షా



లఖింపూర్(యుపి): ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష ఇండియా కూటమి అధికారాన్ని చేపడితే అయోధ్యలోని రామాలయానికి బాబ్రీ తాళాన్ని వేస్తుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆరోపించారు. బుధవారం లఖింపూర్ ఖేరీ లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా తరఫున ఇక్కడ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ బిజెపికి 400 సీట్లు దాటితే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ ఆరోపిస్తున్నాయని తెలిపారు. అది జరిగే అవకాశం లేనప్పటికీ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే మాత్రం అయోధ్య రామాలయానికి బాబ్రీ పేరుతో తాళం పడుతుందని అమిత్ షా ఆరోపించారు. రామ జన్మభూమికి సంబంధించిన న్యాయ వివాదాన్ని ప్రధాని మోడీ గెలవడంతోపాటు రామాలయానికి భూమి పూజ చేశారని, జనవరిలో ఆలయానికి ప్రాణ ప్రతిష్ట కూడా జరిగిందని ఆయన తెలిపారు. లోక్‌సభ ఎన్నికల మొదటి మూడు దశలు పూర్తయిన తర్వాత మోడీ 180 సీట్లు దాటేశారని, నాలుగవ దశ తర్వాత మోడీ నాయకత్వంలో 400 సీట్లు దాటుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎస్‌పి, బిఎస్‌పి, కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. మే 13న నాలుగవ దశలో లఖింపూర్ ఖేరీలో పోలింగ్ జరగనున్నది. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి.

# దక్షిణాది రాష్ట్రాల్లో 60 సీట్లపై బిజెపి గురి

న్యూఢిల్లీ: దక్షిణాధి రాష్ట్రాల్లో బిజెపి పరిస్థితి ఏంటి? గత ఎన్నికల కంటే పుంజుకుంటుందా? లేకుంటే సీట్లు తగ్గుతాయా? అదే జరిగితే బిజెపి లక్ష్యం 370 సీట్లు దాటుతాయా? లేదా? ఇప్పుడు ఇదే చర్చగా మారింది. దక్షిణాధిన ఉన్న 130 స్థానాల్లో.. బిజెపి 29 స్థానాలకే పరిమితం అయ్యింది. కానీ ఈ ఎన్నికల్లోసగం సీట్లైనా దక్కించుకోవాలని బిజెపి భావిస్తోంది.కర్ణాటక,ఏపీ,తమిళనాడులో పొత్తులు కుదుర్చుకుంది. తెలంగాణ, కేరళలో ఒంటరి పోరు చేస్తోంది.. గత ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో మూడింట అసలు బిజెపి ఖాతా తెరవలేదు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. కర్ణాటకలో మాత్రం 28 సీట్లకు గాను 25 స్థానాలను దక్కించుకుంది. తెలంగాణలో 17 స్థానాలు గాను నాలుగింట విజయం సాధించింది. ఈ లెక్కన నాలుగు దక్షిణ రాష్ట్రాల్లో బిజెపి సాధించింది 29 స్థానాలే. అంటే ఇంకా 101 స్థానాల్లో ఆ పార్టీకి ప్రాతినిధ్యం లేనట్టే. ఎన్డీఏ పరంగా 400 సీట్లు, బిజెపి పరంగా 370 సీట్లు సాధించాలని కాషాయ దళం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో గత రెండు ఎన్నికల కంటే బిజెపికి ఆదరణ తగ్గింది అన్న సంకేతాలు వస్తున్నాయి. తొలి మూడు విడతల పోలింగ్లో సైతం గణాంకాలు కొంచెం తక్కువగా ఉన్నాయి. దీంతో బిజెపి దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందుకే ప్రధాని మోదీ తో పాటు అమిత్ షా దక్షిణాది రాష్ట్రాలకు క్యూ కడుతున్నారు. భాగస్వామ్య పార్టీలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. గత పదేళ్లలో ప్రధాని మోదీ 120 సార్లు దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటించారు. అయితే అందులో 64 అధికారిక కార్యక్రమాలు కాగా.. 56 పార్టీ పర్యటనలు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.గత ఎన్నికల్లో ఏపీలో బిజెపి దారుణంగా ఓడిపోయింది. కేవలం 0.97 ఓట్లు మాత్రమే లభించాయి. కేరళలో 12 శాతం ఓట్లు వచ్చిన సీట్లు దక్కలేదు. తమిళనాడులో 3.6% ఓట్లు వచ్చాయి. ఈసారి తెలంగాణలో 10 సీట్లను లక్ష్యంగా పెట్టుకుంది బిజెపి. కర్ణాటకలో సైతం జెడిఎస్ తో పొత్తు పెట్టుకుంది. ఏపీలో టిడిపి,జనసేన తో కలిసి బరిలో దిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో 60 సీట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో 300కు పైగా స్థానాలు సాధిస్తే.. తాము అనుకున్న లక్ష్యానికి చేరువ అవుతామని బిజెపి భావిస్తోంది. అయితే అది ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# దౌత్య విభేదాల వేళ భారత పర్యటనకు మాల్దీవుల విదేశాంగ మంత్రి

న్యూఢిల్లీ: మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్ భారత పర్యటనకు రానున్నారు. మే 9న ఆయన దిల్లీలో మన విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశం కానున్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. మరోవైపు చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ దేశం నుంచి భారత్‌కు తొలి ఉన్నతస్థాయి అధికారిక పర్యటన ఇదే కావడం గమనార్హం.మాల్దీవుల నుంచి భారత బలగాలను వెనక్కి తీసుకోవాలని ముయిజ్జు కోరిన విషయం తెలిసిందే. అందుకు ఆయన మే 10 గడువుగా విధించారు. అది సమీపించిన తరుణంలో ఇరు దేశాల మధ్య సమావేశం జరుగుతుండడం గమనార్హం. అక్కడున్న సైనికుల్లో చాలా మందిని భారత్ ఇప్పటికే వెనక్కి రప్పించింది. గురువారం నాటి భేటీలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు ప్రాంతీయపరమైన అంశాలను చర్చించనున్నట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది. ''హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారతదేశానికి మాల్దీవులు కీలక భాగస్వామి. జమీర్ పర్యటన ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారానికి మరింత ఊతమిస్తుందని భావిస్తున్నాం'' అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

గరుడ వార్త


## కెనడాలోని సిక్కు వేర్పాటువాదులకు భారత్ హెచ్చరిక

ఒట్టావా: నిజ్జర్ హత్య కేసు విషయంలో కెనడాతో దౌత్య విభేదాలు కొనసాగుతున్న వేళ ఒట్టావాలోని భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక్కడి సిక్కు వేర్పాటువాద గ్రూప్‌లు రెడ్‌లైన్ దాటుతున్నారని హెచ్చరించారు. కెనడా గడ్డ నుంచి భారత భద్రతకు పొంచి ఉన్న ముప్పు గురించే తన ప్రధాన ఆందోళన అని అన్నారు. నిజ్జర్ హత్య కేసులో ముగ్గురు భారతీయులను ఇటీవల కెనడా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలపై సంజయ్ వర్మ తొలిసారిగా స్పందించారు. "ద్వంద్వ జాతీయతను భారత్ ఎన్నటికీ గుర్తించదు. ఎవరైనా వలస వస్తే వారిని విదేశీయులుగానే పరిగణిస్తాం. భారత ప్రాదేశిక సమగ్రతపై దుష్టశక్తుల కన్ను పడింది. తమ స్వస్థలాన్ని భారత్ నుంచి విడదీయాలని చూస్తున్న కొందరు.. తమ చర్యలతో రెడ్‌లైన్ దాటుతున్నారు. దీన్ని న్యూఢిల్లీ దేశ భద్రతకు ముప్పుగానే పరిగణించి నిర్ణయాలు తీసుకుంటుంది జాగ్రత్త..!" అని రాయబారి హెచ్చరించారు. ఈ సందర్భంగా భారత్–కెనడా మధ్య దౌత్య విభేదాల గురించి ఆయన స్పందించారు. "ఇటీవల కొంతమంది భారత సంతతి కెనడియన్లు దశాబ్దాల క్రితం నాటి సమస్యలను మళ్లీ లేవనెత్తి ఇరు దేశాల మధ్య ప్రతికూల వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. దాన్ని కెనడా అపార్థం చేసుకోవడంతో సమస్య మరింత క్లిష్టంగా మారింది. సమయం చూసుకుని దీనిపై ఇరు దేశాలు చర్చలతో సమస్యను పరిష్కరించుకుంటాయి" అని వర్మ అన్నారు. ఇటీవల కెనాడాలోని ఒంటారియోలో నిర్వహించిన ఊరేగింపులో ఖలిస్థానీ అనుకూల ప్రదర్శనలు వెలుగుచూడటం వివాదాస్పదమైంది. దీనిపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. హింసను కీర్తించడం ఏ నాగరిక సమాజంలోనూ భాగం కాదని పేర్కొంది. నేర, వేర్పాటువాద శక్తులకు కెనడాలో సురక్షితమైన ఆశ్రయం కల్పించడాన్ని మానుకోవాలని పిలుపునిచ్చింది.

## నెతన్యాహు యుద్ధోన్మాదంపై ఇంటా, బయటా నిరసనలు

టెల్ అవీవ్: గాజాలోని రఫా నగరంలో చిక్కుకున్న నిస్సహాయులైన శరణార్థులను నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోయడాన్ని ఆపాలని జాతీయంగా, అంతర్జాతీయంగా వస్తున్న విజ్ఞప్తులను మితవాద నెతన్యాహు ప్రభుత్వం బేఖాతరు చేస్తూ భూతల దాడుల ప్రణాళికతో మొండిగా ముందుకెళ్తోంది. రఫాలో లక్షమందిని ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ హుకుం జారీ చేయడంతో ఈజిప్టు సరిహద్దును ఆనుకుని వున్న ఈ నగరం నుంచి శరణార్థులు వలసపోతున్నారు. ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వంలో కైరోలో జరిగిన చర్చల్లో ఓ కొలిక్కి వచ్చిన కాల్పుల విరమణ , బందీల విడుదల ఒప్పందాలను మితవాద నెతన్యాహు ప్రభుత్వం బుల్డోజ్ చేయడాన్ని నిరసిస్తూ ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్, హైఫా, జెరూసలెం, బీర్షెవా తదితర పట్టణాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారు. బందీలను విడిపించుకోడానికి బదులు, హమాస్ చివరి రక్షణ దుర్గంగా ఉన్న రఫాను ఆక్రమించుకోవడానికి, పెద్దయెత్తున మారణకాండ సాగించడానికి మొగ్గుచూపుతున్న నెతన్యాహుపై ఇజ్రాయిలీయుల్లో మరీ ముఖ్యంగా 211 రోజులుగా తమవారి విడుదల కోసం ఎదురుచూస్తున్న బందీల కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరహంతకుడు, యుద్ధోన్మాది నెతన్యాహు వెంటనే తప్పుకుని, ముందస్తు పార్లమెంటు ఎన్నికలు నిర్వహించాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. దురాక్రమణను అడ్డుకుందాం అన్న బ్యానర్‌పై టెల్ అవీవ్‌లో ఆదివారం టెల్ అవీవ్‌లోని ఆర్ట్ మ్యూజియం పక్కన హోస్టేజి ఫ్యామిలీ స్క్వేర్ వద్ద జరిగిన భారీ ర్యాలీలో ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ, హడాష్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. గాజాపై దురాక్రమణను తక్షణమే ఆపాలని వారు నినదించారు. బందీల కుటుంబ సభ్యులు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రధాన కార్యాలయం దగ్గర నుంచి కవాతు నిర్వహించారు. బిగిన్ రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బందీగా ఉన్న మటన్ జాన్ గౌకర్ తల్లి ఐనన్ మాట్లాడుతూ, " మా కుటుంబం 200 రోజులకు పైగా నరకయాతన అనుభవిస్తున్నాం. బందీలను విడుదలజేసే ఒప్పందం ఇప్పుడు టేబుల్ మీద సిద్ధంగా ఉంది. హమాస్ దానికి అంగీకరిస్తున్నట్టు సంకేతాలిచ్చింది. నెతన్యాహు మాత్రం ఈ ఒప్పందాన్ని బుల్డోజ్ జేయడానికి మరో ఎత్తుగడ పన్నాడు." అని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధాన్ని ఆపండి, బందీలను విడింపించండి, హమాస్‌తో తక్షణం ఒప్పందం పై సంతకం చేయండి' అంటూ ప్రదర్శనకారులు నినదించారు.

## వ్యవసాయ పరిశోధనలో క్షీణిస్తున్న వ్యయం

న్యూఢిల్లీ : 2011–2022 మధ్య కాలంలో వ్యవసాయ పరిశోధనా వ్యయం క్షీణించింది. వాస్తవానికి వ్యవసాయ పరిశోధనలో ఖర్చు చేసిన వ్యయానికి ప్రతి రూపాయికి సుమారు రూ.13.85 పైసలు రాబడి వస్తుందని సర్వేలో వెల్లడైంది. పైగా వ్యవసాయానికి సంబంధించిన అన్ని ఇతర కార్యకలాపాల నుండి వచ్చే రాబడిని ఇది అధిగమించడం గమనార్హం. రాబడి అధికంగా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం వ్యసాయ పరిశోధనల్లో వ్యయాన్ని పెంచడం లేదని సర్వే స్పష్టం చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసిఎఆర్) కింద పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎపి) గత నెలలో ఈ వర్కింగ్ పేపర్‌ను ప్రచురించింది. ఆహారంతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా తక్కువ వ్యవసాయ విస్తరణ మధ్య వాటి ఉత్పత్తికి భవిష్యత్తులో సవాళ్లను ఎదుర్కొనేందుకు మరింత పెట్టుబడులు అత్యవసరం. ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రయోజనాలను పెంచడానికి వ్యవసాయంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగాలు, వాటి అనుబంధ విభాగాలు ప్రాధాన్యత ప్రధానమైనది. వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలను పెంచిన తర్వాత పెట్టుబడి పెట్టిన ప్రతిరూపాయికి రూ.7.40 రెండవ అత్యుత్తమ రాబడిని ఇస్తుందని పరిశోధనల్లో తేలింది.

# భారత్ వెలిగిపోతోందా?

ప్రధాని మోడీ, బిజెపి నాయకులు చెబుతున్నట్లుగా భారతదేశం ఈరోజు మునుపెన్నడూ లేనంతగా వెలిగిపోతున్న మాట నిజమేనా? ప్రపంచ దేశాలకు భారత్ ఒక రోల్ మోడల్‌గా ఉన్నదా? భారత దేశాన్ని అలాంటి ఉన్నత స్థితిలో నిలపడం ద్వారానే మోడీ విశ్వగురు అయ్యారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే, వివిధ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు, వివిధ అంశాలలో తయారు చేసే వివిధ రకాల సూచీలను, ర్యాంకులను పరిశీలించాలి. దేశమంటే మట్టి కాదు మనుషులు అన్న గురజాడ సూక్తి ప్రకారం, ఒక దేశపు సమగ్ర అభివృద్ధి అంటే ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలలో, వారి స్థితిగతుల్లో, వారు అనుభవించే స్వేచ్ఛలో, సామాజిక గణాంకాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో, వారు పొందే సూపరిపాలనలో అభివృద్ధిగా ఉంటుంది. మరి అటువంటి అంశాల్లో మన దేశం పరిస్థితి, మన దేశ ప్రజల పరిస్థితి ఎలా ఉందో ఒక పరిశీలన చేద్దాం. ఇటీవల మన ప్రధాని, మంత్రిగణం నోట్లోంచి తరచుగా వినిపిస్తున్న మాట "భారతదేశం ప్రపంచపు మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తి కాబోతోంది".

అవును జిడిపి పరంగా 189 దేశాల్లో మనది 3వ స్థానం. కానీ జిడిపి పరంగా తలసరి ఆదాయంలో మన దేశం ఈ 189 దేశాల్లో 140వ స్థానంలో ఉంది. ఇది అత్యంత తీవ్రంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తోంది. ఈదేశపు బడా కార్పొరేట్లను ప్రపంచ కుబేరులుగానూ, ఈ దేశ పేద, మధ్య తరగతి ప్రజనీకాన్ని కటిక దారిద్ర్యంలోకి నెట్టే విధంగానూ పాలకుల విధానాలున్నాయి అన్నమాట. ఆర్థిక స్వాతంత్ర్యంలో 178 దేశాల్లో 123వ స్థానం, మానవ వనరుల వినియోగ సూచీలో 152 దేశాలకు గాను 115వ స్థానంలో ఉండడం, ఉద్యోగ కల్పనలో 47 దేశాల్లో 42వ స్థానంలోను, ప్రజలపై ఉన్న అప్పుల భారంలో 189 దేశాలకుగాను 82వ స్థానంలోను, కనీస వేతనాల అమలులో 156 దేశాలలో 64వ స్థానంలోను, మరీ ముఖ్యంగా ఆధునిక బానిసత్వ సూచీలో 167 దేశాల్లో నాల్గవ స్థానంలో వుండడంపై విషయాన్నే ధ్రువీకరిస్తున్నాయి.

పాలకుల స్వభావం ఆ ప్రభుత్వ ప్రాధమ్యాలలో స్పష్టంగా కనిపిస్తుంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 107 దేశాలకుగాను 94వ స్థానంలోనూ, తలసరి ఆరోగ్య వ్యయంలో 190 దేశాలకు గాను 141వ స్థానంలోనూ, ఎడ్యుకేషన్ ఇండెక్స్‌లో 191 దేశాలకు గాను 145వ స్థానంలో ఉండగా మిలిటరీ వ్యయంలో 186 దేశాలకు గాను మూడవ స్థానంలో ఉండడం ఈ పాలకుల విధానాల్లో డొల్లతనాన్ని, సామ్రాజ్యవాద దేశాల ఆయుధ తయారీ కంపెనీలకు లొంగుబాటును, పొరుగు సరిహద్దు దేశాలతో చెడిపోతున్న సత్సంబంధాలను సూచిస్తోంది. పాలకుల విధానాలే ప్రజల జీవన ప్రమాణాలను నిర్ధారిస్తాయి. ప్రపంచ ఆయుష్షు సూచీలో195 దేశాలకు గాను 125 వ స్థానంలో ఉండగా, ప్రపంచ మానవాభివృద్ధి సూచిలో 189 దేశాలకు గాను 131వ స్థానంలో ఉండడం, సాంఘికాభివృద్ధి సూచీలో 128 దేశాలకు గాను 117వ స్థానంలో ఉండడం, గ్లోబల్ యూత్ డెవలప్మెంట్ ఇండెక్స్‌లో 183 దేశాలకు గాను 134వ స్థానంలో ఉండడం, నవజాత శిశుమరణాల్లో 223 దేశాలకుగాను 113వ స్థానంలో ఉండడం, లింగ తారతమ్యంలో 144 దేశాలకు గాను 108వ స్థానంలో ఉండగా, లింగ వివక్షలో 188 దేశాలకు గాను 76వ స్థానంలో ఉండడం, ఇళ్ళు లేని వారి విషయంలో 52 దేశాలకు గాను 8వ స్థానంలో ఉండగా, పట్టణీకరణలో 199 దేశాలకు గాను 161వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఇండెక్స్‌లో 56 దేశాలకుగాను 43వ స్థానంలో ఉండడం, క్వాలిటీ ఆఫ్ ఎయిర్ ఇండెక్స్‌లో 92 దేశాలకు గాను 84వ స్థానంలో ఉండడం పాలకుల వినాశకర విధానాలను సూచిస్తోంది. 5జి యుగంలోకి తీసుకెళ్తున్నాము, అందరికీ ఇంటర్నెట్ విస్తరించాము అని బాజాలు కొట్టుకుంటున్న మన దేశంలో, జనాభాలో ఇంటర్నెట్ వాడే వారి శాతం ప్రకారం ప్రపంచంలోగల 228 దేశాల్లో 141వ స్థానం లోనూ, అలాగే ఇంటర్నెట్ స్పీడ్‌లో 149 దేశాలకుగాను 89వ స్థానంలో ఉండడం దయనీయమైన వాస్తవాన్ని తెలియజేస్తోంది.

ప్రపంచ సంతోష సూచీలో 156 దేశాలకు గాను 137వ స్థానంలో ఉన్న మన దేశం, ప్రపంచ శాంతి సూచీలో 163 దేశాలకు గాను 139వ స్థానంలో ఉండగా, ఉద్దేశపూర్వక జనహనన కేసుల్లో 219 దేశాలకుగాను రెండవ స్థానంలో ఉండడం, ట్రాఫిక్ ప్రమాదాల వలన జరిగే మరణాల్లో 180 దేశాలకు గాను రెండవ స్థానంలో ఉండడం, ఆత్మహత్యల రేటులో 176 దేశాలకు గాను 19వ స్థానంలో ఉండడం ఆందోళనకరం. "ఎక్కడ పుడితే బావుంటుంది" అనే అంశం మీద 80 దేశాల పౌరులపై చేసిన విశ్లేషణలో మన దేశానికి 72వ ప్రాధాన్యత లభించింది. ప్రజా శ్రేయస్సు సూచికలో 149 దేశాలకు గాను 101వ స్థానంలో ఉండడం, ప్రజాస్వామ్య సూచికలో 112 దేశాలకు గాను 65వ స్థానంలో ఉండడం, చట్టబద్ధ పాలన సూచీలో 113 దేశాలకు గాను 68వ స్థానంలో ఉండడం, పత్రికా స్వేచ్ఛలో 180 దేశాలకు గాను 148వ స్థానంలో ఉండడం, పాలకుల ఫాసిస్టు పోకడలను, నిరంకుశ విధానాలను ప్రతిబింబిస్తోంది.

పై గణాంకాలన్నీ ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థలు, వరల్డ్ బ్యాంక్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ఎంతో శాస్త్రీయంగా తయారు చేసినవే. వ్యవస్థీకృత సోషల్ మీడియా నెట్‌వర్క్, వాట్సాప్ యూనివర్సిటీ సహాయంతో ఫేక్ పోస్టుల ద్వారా, తమ లోప భూయిష్ట పాలనను అద్భుతమైన పాలనగా చిత్రీకరించు కుంటున్నారు కేంద్ర బిజెపి పాలకులు. తమకి తామే విశ్వగురు, 56 అంగుళాల ఛాతీ వంటి ప్రశంసలు ఇచ్చేసుకుంటున్నారు. దేశం వెలిగిపోతోందని నమ్మబలుకుతూ, ప్రజలకు వాస్తవాలు అర్థం కానివ్వకుండా వారిలో కులమతాల విద్వేషాలు నింపుతున్నారు. మరోసారి మందిరం ముసుగుతో అధికార పీఠం ఎక్కేస్తే, ఇక రానున్న ఐదేళ్లలో రాజ్యాంగ మౌలిక అంశాలను కూడా మార్చేసి, ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే మతం, ఒకడే రాజు–అన్న చందంలో అఖండ హిందూ సామ్రాజ్య స్థాపన వైపు దేశాన్ని తీసుకెళ్లే కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిద్దామనుకుంటున్న వీరు ఒక్క విషయం మర్చి పోతున్నారు. నిప్పుని పొట్లం కట్టి జేబులో దాచే ప్రయత్నం చేస్తే, అది జేబుని దహించుకుంటూ బయటికొచ్చి తన ఉనికిని చాటుతుంది. అలాగే మెజారిటీ ప్రజల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంటే, ఈ విషయాన్ని మరుగుపరిచి అంతా ఘనంగా ఉందంటూ నమ్మబలికే ప్రయత్నం ఎంత తీవ్రంగా చేసినా.. పై గణాంకాలు వాస్తవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరిస్తున్నాయి. వివిధ కీలక అంశాల్లో మన పాలకుల వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని, తప్పుడు ప్రాధాన్యతలను ఎత్తి చూపుతున్నాయి. ఈ గణాంకాలు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వంటి సాధనాల ద్వారా విస్తృత జన బాహుళ్యానికి తక్షణం చేరాల్సిన అవసరం ఉంది. ప్రజలు నిన్ను నీ మాటలను బట్టి కాక, నీ చేతలను బట్టి అంచనా వేస్తారనే స్పృహ లేని ఈ పాలకులకు పై గణాంకాలను బట్టి జరుగుతున్న ఎన్నికల్లో తగిన శాస్తి తప్పకుండా జరుగుతుంది.

# ఔషధాల ధరలకు రెక్కలు

పేటెంట్ నిబంధనలకు ఇటీవల చేసిన సవరణ జెనరిక్ ఔషధ ఉత్పత్తికి అదనపు అడ్డంకులను సృష్టించింది. తద్వారా పేటెంట్ హోల్డింగ్ కంపెనీలు ఎక్కువ కాలం పాటు గుత్తాధిపత్య ధరలను వసూలు చేయడానికి వీలు కల్పిస్తుంది. స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసో సియేషన్‌తో భారత ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ఐదు రోజుల తర్వాత, సవరించిన నియమాలు 15 మార్చి, 2024న నోటిఫై చేయబడ్డాయి. బహుళజాతి ఫార్మా కంపెనీలు పేటెంట్ కొరకు భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. హుళజాతి ఫార్మాస్యూటికల్ కంపెనీలు భారతీయ మార్కెట్‌లో అధిక ధరలకు అనేక ఔషధాలను సులభతరంగా అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం తన పేటెంట్ నిబంధనలను సవరించింది. పేటెంట్ అనేది కొత్తగా కనిపెట్టిన ఉత్పత్తులపై పెట్టుబడిదారీ కంపెనీలు అనుభవిస్తున్న గుత్తాధిపత్యం ఒక రూపం. ఒక ఫార్మా కంపెనీ కొత్త ఔషధం కోసం పేటెంట్ పొందినప్పుడు, ఆ ఔషధాన్ని ఉత్పత్తి చేసి విక్రయించే ఏదైనా ఇతర కంపెనీ లేదా వ్యక్తి విక్రయించిన ప్రతి యూనిట్‌కు రాయల్టీ అని పిలువబడే రుసుమును పేటెంట్ హోల్డింగ్ కంపెనీకి చెల్లించాలి. అందువలన, పేటెంట్లు పెట్టుబడిదారీ కంపెనీలు సృష్టించే ఏదైనా కొత్త ఉత్పత్తిపై గుత్తాధిపత్యాన్ని కొనసాగడానికి ఉపయోగ పడుతాయి. విపరీతమైన ధరలను వసూలు చేయడం, సమాంతర దిగుమతులను నిషేధించడం (చట్టబద్ధంగా విదేశాల్లో ఉత్పత్తి చేయబడిన పేటెంట్ ఉత్పత్తిని దిగుమతి చేసుకోవడం), ప్రత్యేకమైన లైసెన్సింగ్ ఒప్పందాల ద్వారా సరఫరాను పరిమితం చేయడం, ఆవిష్కరణలను కనిష్టంగా సవరించడం ద్వారా అసలు పేటెంట్ జీవితకాలానికి మించి పేటెంట్లను కొనసాగించడం, పేటెంట్ హోల్డర్లు తమ గుత్తాధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం సాధారణంగా చూసే పద్ధతులు. ఔషధ పరిశ్రమలో, ఇటువంటి పేటెంట్ విధానాలు ఔషధ తయారీదారులు దిగుమతి చేసుకున్న మందులకు అధిక ధరను వసూలు చేయడానికి వీలు కల్పిస్తాయి. వారు జనరిక్ ఔషధాల ఉత్పత్తికి అదనపు అడ్డంకులను సృష్టిస్తారు. ఇది దేశంలో ఔషధాల ధరలకు దారితీసే అవకాశం ఉంది. పేటెంట్ జీవితకాలం ముగిసినప్పుడు, ఇతర తయారీదారులు వారి స్వంత సాంకేతికతను ఉపయోగించి అదే ఔషధాన్ని ఉత్పత్తి చేయవచ్చు. ఇటువంటి మందులను జెనరిక్ మందులుగా సూచిస్తారు, ఇప్పుడు ఉత్పత్తిపై గుత్తాధిపత్యం ఏ ఉత్పత్తిదారుడు కలిగి



ఉండనందున చాలా చవకగా ఉంటాయి. పేటెంట్ నిబంధనలకు ఇటీవల చేసిన సవరణ జెనరిక్ ఔషధ ఉత్పత్తికి అదనపు అడ్డంకులను సృష్టించింది. తద్వారా పేటెంట్ హోల్డింగ్ కంపెనీలు ఎక్కువ కాలం పాటు గుత్తాధిపత్య ధరలను వసూలు చేయడానికి వీలు కల్పిస్తుంది. స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో భారత ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ఐదు రోజుల తర్వాత, సవరించిన నియమాలు 15 మార్చి, 2024న నోటిఫై చేయబడ్డాయి. బహుళజాతి ఫార్మా కంపెనీలు పేటెంట్ కొరకు భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. భారత దేశంలోని పేటెంట్ వ్యవస్థ ఏదైనా భారతీయ పౌరుడు, ఇతర దేశాల వారు కూడా పేటెంట్ మంజూరు కాకముందే వ్యతిరేకతను దాఖలు చేయడానికి అనుమతిస్తుంది. దీన్నే 'ప్రీ గ్రాంట్ ప్రతిపక్షం' అంటారు. బహుళజాతి ఫార్మా కంపెనీలు ముందస్తు మంజూరు వ్యతిరేకతను అనుమతించడం ఇష్టం లేదు. కొత్త పేటెంట్ నియమాలు ఈ నిబంధనను గణనీయంగా తగ్గించాయి. ప్రతి సంవత్సరం సమాచారాన్ని అందించడానికి బదులుగా, పేటెంట్ పొందిన వ్యక్తి దానిని మూడు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే సమర్పించాలి. ఆర్జించిన ఆదాయంపై సమాచారం ఇవ్వాలనే నిబంధన పూర్తిగా తొలగించబడింది. అలాగే ఔషధం దిగుమతి చేసుకున్నదా అనే సమాచారం ఉంది. పేటెంట్ పొందిన వ్యక్తి భారత దేశంలో పేటెంట్ పని చేసిందో లేదో సూచించే పెట్టెను టిక్ చేయాలి. ఇది తప్పనిసరి లైసెన్సింగ్‌ను మరింత కష్టతరం చేస్తుంది. పేటెంట్ నిబంధనలలో ఇటీవలి సవరణలు భారతీయ ప్రజల ఖర్చుతో బహుళ జాతి కంపెనీల లాభాలను పెంచి మన దేశంలో అవసరమైన మందుల ధరలను గణనీయంగా పెంచే అవకాశం ఉంది.

# ఐక్యతకు ప్రతీక ఇయు

యూరోపియన్ యూనియన్ (ఇయు) పౌర సమాజం 09 మే రోజున 'యూరోప్ దినోత్సవాన్ని (యూరోప్ డే)' ఘనంగా నిర్వహించుకోవడానికి యూరోప్ దేశాలు సిద్ధంగా ఉన్నాయి. యూరోప్ ప్రాంతంలో 44 దేశాలు ఉండగా, యూరోపియన్ యూనియన్‌లో జర్మనీ, ఫ్రాన్స్, స్పేయిన్, స్వీడెన్, డెన్మార్క్, బెల్జియమ్, బర్గేరియా లాంటి 27 దేశాలు మాత్రమే సభ్యులుగా ఉన్నారు. 2002లో ఈయూ దేశాలు 'యూరో' కరెన్సీని ఆమోదించి అమలులోకి తేవడం ఓ గొప్ప విశేషం. యూరోప్ సమాజం అనేక స్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, గతాన్ని విశ్లేషించుకొని రేపటి వెలుగుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఇయూ పార్లమెంట్, కమీషన్, ఇతర ప్రముఖ సంస్థలతో పాటు ప్రపంచ పౌరసమాజం కూడా యూరోప్ దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. యూరోప్‌లో రాజకీయ ఏకీకరణ కోసం 09 మే 1950 రోజున ప్రయత్నించిన 'రాబర్ట్ షుమన్' ప్రతిపాదించిన 'షూమన్ డిక్లరేషన్'కు గుర్తుగా 09 మే రోజున 'యూరోప్ డే'గా 1985 నుంచి నిర్వహించుట జరుగుతున్నది. షూమన్ ప్రతిపాదనలతోనే 'యూరోపియన్ యూనియన్' భావన మొలకెత్తింది. యూరోప్‌లోని ఫ్రెంచ్, జర్మనీ దేశాలు బొగ్గు, స్టీల్ పరిశ్రమలను ఏకం చేసి "యూరోపియన్ కోల్ అండ్ స్టీల్ కమ్యూనిటీ' నీడన చేర్చి ఉత్పత్తులు చేయడం 18 ఏప్రిల్ 1951న ప్రారంభమైంది. యూరోప్ దినం వేదికగా యూరోపియన్ సమాజం చర్చలు, ఉపన్యాసాలు, నాటికలు, కచేరీలు, వేడుకలు లాంటి పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ఆధునిక యూరోపియన్ సమాజం ముందున్న సవాళ్ళను విశ్లేషిస్తూ, ప్రజాక్షేమం వైపుకు ప్రగతి దారులు వేయుటకు కృషి చేయటం జరుగుతుంది. 29 జూన్ 1985న యూరప్ డే, యూరోప్ పతాకం కూడా అమోదించుట జరిగింది. 'యూరోప్‌లో శాంతి, ఐక్యత (పీస్ అండ్ యునిటీ ఇన్ యూరోప్)' కోసం 05 మే రోజున 'కౌన్సిల్ ఆఫ్ యూరోప్', 09 మే రోజున 'యూరోపియన్ యూనియన్' ఆవిర్భావ ఉత్సవాలు జరుపుకుంటారు. 05 మే 1949న 'కౌన్సిల్ ఆఫ్ యూరోప్' ఏర్పడిన తరువాత 1964 నుంచి 'యూరోప్ కౌన్సిల్ దినం' నిర్వహించబడుతున్నది. యూరోప్ డే వేడుకల్లో భాగంగా బ్రెజెల్స్, స్ట్రాస్‌బర్గ్ నగరాల్లోని ఈయూ సంస్థలను (యూరోపియన్ పార్లమెంట్, కౌన్సిల్ ఆఫ్ ఈయూ, యూరోపియన్ కమీషన్, యూరోపియన్ ఎకనమిక్ అండ్ సోషల్ కమిటీ, యూరోపియన్ కమిటీ ఆఫ్ ది రీజియన్) ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచుట జరుగుతుంది. ఈయూ సభ్యదేశాలు ఆధునికత వైపుకు కలిసికట్టుగా ఐక్యతా మంత్రంతో సమగ్రాభివృద్ధి, శాంతియుత సహజీవనం దిశగా అడుగులు వేస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుందాం.

## మెప్మా ఆధ్వర్యంలో ఓటు అవగాహన ర్యాలీ

బోథ్: మెప్మా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మీవాడ, జై జవాన్ నగర్, తాటి గూడ భాగ్యనగర్, క్రాంతి నగర్ వార్డులలో బుదవారం ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆటపాట ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది టీఎంసీ భాగ్యలక్ష్మి, సిఓ పన్నాలాల్, సందీప్ రెడ్డి ఆర్పీలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన టిఆర్ఎస్ నేతలు

నిర్మల్: కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని మాజి కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుదవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ షౌకత్ అలీ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్, నేతలు లోక ప్రవీణ్, షకీల్, కలీం ఉన్నారు.

# హోరెత్తుతున్న ప్రచారం

హైదరాబాద్: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీల ప్రచారం జోరందుకుంది. ఇక మిగిలింది ఐదు రోజులే కావడంతో ఎన్నికల ప్రచారం తుదిదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే జాతీయ పార్టీల ఢిల్లీ నేతలు తెలంగాణ గల్లీలకు క్యూ కడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ సీట్లు సాధించాలన్న లక్ష్యంతో దూకుడుగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్రంలో పర్యటించిన బిజెపి, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ఆదివారం నుంచి విస్తృతంగా పర్యటించేలా ప్రణాళికలు ఖరారు చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఆయా పార్టీల కీలకనేతలందరూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. బిజెపి తరపున ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆ పార్టీ జాతీయ అధ్యకుడు జెపి నడ్డా, కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు వరుసగా రాష్ట్రంలో పర్యటిస్తారని ఆయా పార్టీల నేతలు తెలిపారు. మరో వైపు రాష్ట్రంలో కీలకమైన బిఆర్ఎస్ తరపున ఆ పార్టీ అధినేత కెసిఆర్ కూడా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో 400 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న బిజెపి అందుకు తగినట్టుగా తెలంగాణలో మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని భావిస్తోంది. బిజెపి తరపున ఆ పార్టీ జాతీయ నేతలు నెల రోజులుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఇతర అగ్రనేతలు పలుమార్లు రాష్ట్రానికి వచ్చారు. పోలింగ్‌కు ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు మరోమారు ముందుకు వస్తున్నారు. ప్రధాని మోడీ ఈనెల 8, 10 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించి బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. నేడు అమిత్‌షా, ఆరో తేదీన జేపీ నడ్డాలు రాష్ట్రానికి వస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరిల్లో అమిత్ షా, పెద్దపల్లి, భువనగిరి, నల్లగొండలో నడ్డా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్ నుంచి అతిరథ మహారథులు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న తరుణంలో రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ ప్రచార బరిలోకి దిగుతున్నారు. నిజానికి ఈ ఎన్నికల్లో తెలంగాణలో ప్రియాంకగాంధీ కేంద్రంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, వీలైనన్ని ఎక్కువసార్లు ఆమెను ప్రచారానికి తీసుకురావాలని టిపిసిసి భావించింది. కానీ, ఇతర రాష్ట్రాల ప్రచార షెడ్యూల్ కారణంగా అది సాధ్యం కాలేదు. 10వ తేదీ వరకు రాహుల్‌గాంధీ, ప్రియాంకలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా సభలు, రోడ్ షోలలో పాల్గొంటారు. నాంథేడ్ నుంచి నేరుగా నిర్మల్‌లో జరుగనున్న ఎన్నికల ప్రచార సభకు రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. అక్కడ అదిలాబాద్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఆ తరువాత అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని అలంపూర్, ఎర్రవల్లి కూడలి







వద్ద జరురగనున్న ఎన్నికల ప్రచార సభకు సాయంత్రం 5 గంటలకు రాహుల్‌గాంధీ హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 9వ తేదీన ఉదయం కరీంనగర్, సాయంత్రం 5 గంటలకు సరూర్ నగర్‌లోనూ రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు. గాంధీ రాష్ట్ర పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో తెలంగాణకు రావాల్సిన ప్రియాంక గాంధీ రాష్ట్ర పర్యటన వాయిదా పడింది. ఈ నెల 10వ తేదీన ఎల్లారెడ్డి, తాండూర్, షాద్‌నగర్‌లలో ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు. వీరితోపాటు ఏఐసిఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఎన్నికల ప్రచారానికి హాజరవుతారని టిపిసిసి వర్గాలు తెలిపాయి. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సైతం ఎన్నికల ప్రచారంలో ముందుకెళుతున్నారు. గతంలో రూపొందించిన షెడ్యూల్‌కు అనుగుణంగానే ఈ నెల 10వ తేదీ వరకు కెసిఆర్ బస్సుయాత్ర ఉంటుందని బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఈనెల 10వ తేదీన సిరిసిల్లలో రోడ్ షో, సిద్ధిపేటలో బహిరంగ సభతో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగుస్తుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రచారానికి వడదెబ్బతెలంగాణలో బడా నాయకుల సభలకు ప్రజలను తీసుకు రావడం ఇప్పుడు చాలా పార్టీలకు కష్టమైపోయింది. దాంతో అనేక సభలను, రోడ్ షోలను తగ్గించేసుకుంటున్నారు. లోక్ సభ ఎన్నికలకు ఇంకా వారం రోజుల సమయమే ఉంది. ఎండలు ఇటు తెలంగాణలోనూ, అటు ఆంధ్రలోనూ రాజకీయ పార్టీల ప్రచారానికి పెద్ద అడ&ఢంకిగా తయారయ్యాయి. ఆంధ్రలోనైతే అత్యధిక ఉష్ణోగ్రత 47 డిగ్రీల సెల్సియస్ కూడా దాటుతోంది. వడ దెబ్బకి ఇరు రాష్ట్రాలలో అనేక మంది చనిపోయారు కూడా. వచ్చే వారం అయితే ఎండలు మరింత తీవ్రం కానున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ప్రజలు బయట తిరగొద్దని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 10 తర్వాత నుంచి సాయంత్రం 5.00 వరకు ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల చాలా మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. నంద్యాల జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత 47.7 డిగ్రీల సెల్సియస్ దాటింది. ప్రకాశం, కడప జిల్లాల్లో కూడా ఎండలు మండిపోతున్నాయి. తెలంగాణలో కూడా గరిష్ఠంగా 42 డిగ్రీల సెల్సియస్ ఎండలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 3 నుంచి 4 పబ్లిక్ మీటింగ్ లలో ప్రసంగిస్తున్నారు. ఆయన తన ఆరోగ్యం గురించి కూడా పట్టించుకోవడం లేదనే చెప్పాలి. ఆయన హెలికాప్టర్ ద్వారా ఆయా నియోజకవర్గాలకు సమయానికి చేరకుంటున్నారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అయితే చాలా వరకు సాయంత్రం దాటాకే ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఆయన బస్సు యాత్ర ద్వారా రోజుకు ఒకటి లేక రెండు పబ్లిక్ మీటింగ్ లలో ప్రసంగిస్తున్నారు. బిజెపి చెవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అయితే ఇటీవల తాండూర్ సెగ్మెంట్ లో ప్రచారం చేస్తూ డీహైడ్రేషన్ కు గురయ్యాడు. ఇప్పుడాయన ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్)ను త్రాగు నీటితో కలుపుకుని ప్రచారం చేస్తున్నాడు. అసదుద్దీన్, అక్బరుద్దీన్, మాధవీలత అయితే పొద్దున, సాయంత్రం అన్న తేడా లేకుండా ప్రచారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అయితే రోజుకు రెండు మూడు జిల్లాల్లో బస్సు యాత్ర కొనసాగిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆయన రోడ్ షోకు జనం కూడా బాగానే వస్తున్నారు. ఇక మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అయితే హెలికాప్టర్ లో తిరుగుతూ రోజుకు రెండు మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు.

## ఐరన్ బండ, యనగండ్ల, గ్రామాల్లో వైయస్సార్ కాంగ్రెస్ రోడ్ షో



గోనెగండ్ల: ఐరన్ బండ, యనగండ్ల, గ్రామాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల తో కలిసి జన జాతర లా రోడ్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి బలపరిచిన, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ బీసీ మహిళ అయిన నాకు మీరు నన్ను ఎమ్మెల్యే గా గెలిపిస్తే ఎమ్మిగనూరు మీరందరి సహాయ సహకారాలతో అభివృద్ధికి కృషి చేస్తానని, రోడ్లు, డ్రైనేజీలు,వాటర్ సమస్యలు జగనన్న దృష్టికి తీసుకెళ్లి శాశ్విత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మీ అమూల్యమైన ఓట్లను మంచి చేసే జగనన్నకే ఓటు వేయాలని, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన నాకు, ఎంపీ అభ్యర్థి అయిన బి వై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి వేయించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు బి.ఆర్ బసిరెడ్డి, గోనెగండ్ల మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రౌస్ అవెన్యూ కోర్టులో ఎమ్మెల్సీ కవితకు మళ్ళీ షాక్



న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం మళ్ళీ చుక్కెదురైంది. లిక్కర్ పాలసీలో ఈడీ, సీబీఐ కేసులో కవితకు ఊరట దక్కలేదు. తనకు బెయిల్ కావాలని కవిత దాఖలు చేసిన పిటిషన్లను ఈరోజు రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరించారు. జడ్జి కావేరి బవేజా. లిక్కర్ పాలసీ కేసులో కవిత కింగ్ పిన్గా పేర్కొన్న దర్యాప్తు సంస్థల వాదనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, కవిత బయటకు వస్తే కేసు దర్యాప్తు ప్రభావితం అవు తుందని, ఆధారాలు, సాక్షా లను కవిత తారుమారు చేసే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది.

## మహిళలకు మరింత భద్రత.. పోకిరీలపై నిర్భయ చట్టం

హైదరాబాద్: సామాజిక మాధ్యమాల ద్వారా విద్యార్థునులతో పరిచయం పెంచుకొని వేధింపులకు పాల్పడే పోకిరీలపై నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేయనున్నారు. విద్యార్థునులతో స్నేహం పెంచుకుని, ఆపై ప్రేమించాలని పోకిరీలు వేధిస్తున్నారన్న ఫిర్యాదులే అధికంగా షీటీం పోలీసులకు అందుతున్నాయి. ఈక్రమంలో పోకిరీల ప్రేమను తిరస్కరించిన విద్యార్థునుల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యంగా మార్చి వేధిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు.

మార్ఫింగ్ చేసిన అసభ్య చిత్రాలు, అశ్లీల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ఉంచుతామంటూ బెదిరిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై దర్యాప్తు వేగవంతం చేసి నిందితులపై నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కలంలో షీ టీం పోలీలకు అందిన ఫిర్యాదుల్లో 70 శాతం ఫోన్లు, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల నుంచే ఉంటుంటడం గమనార్హం.

ఈక్రమంలో షీ బృందాల వద్దకు వస్తున్న బాధితుల మనోవేదన, మానసిక పరిస్థితిని స్వయంగా చూస్తున్న పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదు తీవ్రత ఆధారంగా నిందితులపై నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు. గడచిన ఆరు నెలల్లో 45 మంది నిందితులపై నిర్భయ చట్టం కింద అరెస్టు చేసి జైలుకు పంపించారు.

**మరింత బలోపేతం..**

విద్యార్థునుల, మహిళల భద్రత కోసం పనిచేసే షీ టీమ్‌లను రాష్ట్ర వాప్తంగా మరింత బలోపేతం చేసేందుకు సమాయత్తమౌతున్నాయి. రాష్ట్రంలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, మహబూబాబాద్‌లో ఇప్పటికే భరోసా కేంద్రాలుండగా, ఇటీవల యాదాద్రి భువనగిరి, శంషాబాద్, జోగులాంబ గద్వాల, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ కేంద్రాల సంఖ్యను మరింత పెంచి బాధిత మహిళలకు న్యాయ, వైద్య, రక్షణ, పరిహారం వంటి అన్ని సహాయ సహకారాలు అందించేందుకు ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు సమాలోచనలు సాగిస్తున్నారు. అతివలను వేధిస్తున్న మృగాళ్లు, ఆకతాయిల ఆటకట్టిస్తూ వారిని కటకటాల్లోకి పంపించేందుకు మహిళల కోసం ప్రత్యేకంగా జిల్లా కేంద్రాల్లో మహిళా పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసిన విషయం విదితమే. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేకించి ఉమెన్ రిసెప్షన్ సెల్‌ను ఏర్పాటు చేయడంతో బాధిత మహిళలు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని పోలీసు శాఖ ఉన్నతాధికారులు వివరిస్తున్నారు.

**డయల్ 100..**

మహిళలను వేధించే అకతాయిపై వాట్సాప్, డయల్ 100, హాక్‌ఐ, ఈ-మెయిల్, సోషల్ మీడియా, క్యూఆర్ కోడ్స్ ద్వారా షీ టీమ్ అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. బస్‌స్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కళాశాలలు, సినిమా హాళ్ల వద్ద క్యూఆర్ కోడ్‌తో కూడిన షీటీమ్ పోస్టర్లను అతికించడంతో పాటు బాధితులు వెంటనే క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. అలాగే యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏర్పాటు చేసి మహిళలు, పిల్లల అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వేధిస్తున్న ఆకతాయిలకు షీ సైబర్ ల్యాబ్‌తో షీటీములను ఏర్పాటు చేసి ర్యాగింగ్, ఈవ్‌టీ జింగ్, పోక్సో చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా హైస్కూళ్ల, కాలేజీల్లో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు నేరాల నివారణకు శిక్షణ ఇవ్వడంతో పాటు షార్ట్‌ఫిల్మ్‌లు, యాడ్స్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా భద్రతా చర్యలను వివరిస్తున్నారు.

## సొంతూళ్లకు జనం

హైదరాబాద్: : ఎన్నికలకు మరో వారం రోజుల సమయం మాత్రమే ఉండడంతో నగర ప్రజలు తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. పిల్లలకు వేసవి సెలవులు, ఇటు ఎన్నికలు ఉండడంతో వారం రోజుల ముందే ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. ఈనెల 13న తెలంగాణలో లోక్ సభ ఎన్నికలకు పోలింగ్......ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఏపీకి చెందిన నగరవాసులకు హైదరాబాద్ తో పాటు తమ సొంత గ్రామాల్లో కూడా ఓటు హక్కు ఉండడంతో.... గ్రామాల్లో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం అక్కడ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే ఆర్టీసీ బస్సులకు, రైళ్లకు భారీ డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ ట్రైన్స్ ఇప్పటికే రద్దీ పెరుగుతుంది. ఎండాకాలం కావడంతో ఏసీ కోచ్ లలో రిజర్వేషన్లు కూడా త్వరగా ముగుస్తున్నాయి. ఇటు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినప్పటికీ......గడిచిన రెండు రోజుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. సాధారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షలు రాకపోకలు సాగిస్తే.....గత కొద్ది రోజులుగా ఆ సంఖ్య దాదాపు 3 లక్షలకు చేరిందని అధికారులు అంటున్నారు. అయితే ఈసారి సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, వాచ్ మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా పని చేసే లక్షలాది మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. ఇదిలా ఉంటే హైదరాబాద్ లో స్థిరపడ్డ ఏపీ ప్రజలను తమ సొంతూళ్లకు తరలించేందుకు రాజకీయ పార్టీలు ప్రైవేట్



బస్సులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాయట. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సైతం భారీగా డిమాండ్ పెరిగింది. సుమారు 1500 ఆర్టీసీ బస్సులు ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులను నడిపేందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆలోచిస్తుంది. ఇటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సైతం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచేందుకు యోచిస్తోంది. ఆర్టీసీ బస్సుల సంగతి ఇలా ఉంచితే.....అటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సైతం విపరీతంగా డిమాండ్ పెరుగుతుంది. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. ప్రైవేట్ బస్సులో బుకింగ్స్ కూడా పెరిగిపోయాయి. సాధారణం కంటే నగరంలో 1000 ప్రైవేట్ బస్సులు అదనంగా ఏపీకి రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీ నగర్, సికింద్రబాద్, కేపీహెచ్బీ నుంచి అధిక బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.


## మోదీ హయంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు



పెద్దపల్లి: పెద్దపల్లి జన సభ లో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడారు. పెద్దపల్లి గడ్డకు రావడం నా అదృష్టం,ఓదెలా మల్లన్న దేవుడి ఆశీర్వాదం ఉండాలని కోరుకుట్టున్నాను. తెలంగాణ కు రైల్వే లైన్లు అభివృద్ధి చేయడం జరిగింది.. తెలంగాణకు మూడు వందే భారత్ రైళ్లు మంజూరు చేసాం. స్టీల్ ఉత్పత్తిలో తెలంగాణ మూడో స్థానంలో వుంది. మోదీ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారు. ఏ బి సి పార్టీలు ముస్లిం ఏజెండాను ముందుకు తీసుకెళ్తున్నారు... కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చేస్తున్నారు. భారత జనతా పార్టీ వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను ఘనంగా జరుపుకుంటున్నాం. మూడు పార్టీలు ముస్లిం ఎజెండాను మన మీద రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగి రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారు రిజర్వేషన్ల గురించి మాట్లాడే అర్హత రాహుల్ గాంధీ ఉందా . పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్ ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు.

## 3 కోట్ల మన్ననలు పొందిన యాప్

మెదక్: పంటలకు సోకే వివిధ రకాల తెగుళ్లను, క్రిమి కీటకాలాను గుర్తించడంలో, ఈ మొబైల్ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు అంటున్నారు. మూడు కోట్ల మంది రైతులు ఉపయోగిస్తున్న ఇప్పటివరకు 60 రకాల పంటలకు సంబందించిన 10 కోట్ల ఫోటోలను ప్లాంటిక్స్ యాప్ లోకి అప్లోడ్ చేయగా, వాటిని విశ్లేషించి, సుమారుగా 700 రకాల తెగుళ్లను, క్రిమికీటకాలు ప్లాంటిక్స్ యాప్ గుర్తించందని శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులు సులువుగా అర్ధం చేసుకోవడానికి, వారి వారి భాషలోనే సమాచారం ఇచ్చేవిధంగా ఈ యాప్ ని అభివృద్ధి చేసారు ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు. ప్రపంచవ్యాప్తంగా, అత్యంత ప్రాచుర్యంలో ఉన్న 20 భాషల్లో ప్లాంటిక్స్ యాప్ తన సేవలను అందిస్తుంది. పదేండ్ల కింద తయారు చేసిన ఈ యాప్ యొక్క వాడకం ఇటీవల బాగా పెరిగింది. సామాన్య రైతులలో కూడా మొబైల్ ఫోన్ వాడకం బాగా పెరగడంతో రైతులు వ్యవసాయ విజ్ఞానాన్ని మొబైల్ ద్వారా తెలుసుకుంటున్నారనే దానికి నిదర్శనం ఈ మార్పు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సహాయంతో, ఈ మొక్కకు, ఆ తెగులును, క్రిమికీటకాలు ఎలాంటి మందులు వాడాలని ప్లాంటిక్స్ యాప్ రైతులకు సూచిస్తుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు తెలిపారు. టెక్నాలజీ ని ఉపయోగిస్తూ రైతులకు యాజమాన్య పద్ధతుల పైన సులువుగా సలహాలు ఇవ్వటమే ఇక్రిశాట్ లక్షమని, ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ జాక్వెలిన్ డి ఆరోస్ హ్యూస్ తెలిపారు. టెక్నాలజీ వినియోగం రోజు రోజుకు పెరుగుతున్న సమయంలో, రైతులు అందరు కూడా ఇప్పుడు మొబైల్ ఫోన్




వాడుతున్నారని, దానివలన ప్లాంటిక్స్ వినియోగం పెరిగిందని ఆమె తెలిపారు. ప్లాంటిక్స్ వల్ల ఉపయోగం ఉండటం వలెనే, రైతులు ఆ మొబైల్ యాప్ ని విరివిగా వాడుతున్నారని ఆమె అన్నారు. రైతులకు ఇప్పుడు ప్లాంటిక్స్ తో అందించే సేవలను కూడా పెంచాలని ఆ సంస్థ యోచిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా, మారుమూల గ్రామాల్లాలో కూడా చిన్న చిన్న కమతాల్లో పంటలు పండిస్తున్న రైతులు కూడా ఈ యాప్ ద్వారా లబ్ది పొందుతున్నారని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్లాంటిక్స్ యాప్ సిమోన్ స్త్రే మాట్లాడుతూ ప్లాంటిక్స్ ప్రయాణంలో ఎందరో పాత్ర ఉన్నదని అయన కొనియాడారు.

## మావోయిస్టుల ఐఈడీని నిర్వీర్యం చేసిన పోలీసులు

బీజాపూర్: గడ్చిరోలి పోలీసులు మావోయిస్టులు డంప్ చేసిన ఐఈడీని ధ్వంసం చేసారు. ఐఈడీ ఆ దాడులకు ప్లాన్లో ఉన్న మావోయిస్టులు కొన్ని పేలుడు పదార్థాలు మరియు క్లెమోర్ మైన్లను టిపగడ్ ప్రాంతంలో గుర్తించారు. పోలీసులను టార్గెట్ గా వీటిని ఉపయోగించడానికి తయారు చేసారు. విశ్వసనీయ సమాచార మేరకు ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేసారు. భారీ స్థాయిలో భద్రతా బలగాలను కూంబింగ్ జరిపారు. పోలీసుల కూంబింగ్ సమయంలో మావోయిస్టులు ఈ క్లైమోర్లు / పేలుడు పదార్థాలను ఉపయోగించడం సాధ్యపడలేదు. టిపగడ్ ప్రాంతంలో పిన్ పాయింట్ లొకేషన్ను కనిపెట్టారు. పేలుడు పదార్థాలు మరియు క్లైమోర్లను పర్వతంపై మావోయిస్టులు దాచిపెట్టారు. అదే స్థలంలో ప్లాస్టిక్ బ్యాగ్లో గన్పౌడర్, మందులు మరియు దుప్పట్లను కూడా బృందాలు గుర్తించారు.

# పెదాలు నల్లగా మారుతున్నాయా......




చాలామంది యువత ఆరోగ్యం పై, అందంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంటారు. అందులో భాగంగానే తమజుట్టుకు, ముఖం అందంగా కనిపించేందుకు ఆముదం రాసుకుంటుంటారు. అంతే కాదు కొంత మంది ఆ నూనెను ఆహారంలో కూడా చేర్చుకుంటారు. ఈ ఆముదంలో అనేక ఔషధ గుణాలు, పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఒమేగా 6, 9 వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఇందులో ఉంటాయి. విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఆముదంలో ఉన్నాయి. ఈ నూనెను ఆహారంలో చేర్చుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అలాగే జీర్ణక్రియను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ నూనెను రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల అలర్జీలు, మొటిమలు, మచ్చలు, మొదలైన సమస్యలు దూరమవుతాయి. మీరు ప్రతిరోజూ మీ పెదవుల పై ఆముదం నూనెను రాసుకుంటే, అది మీ పెదాలను మృదువుగా, గులాబీ రంగులో మార్చడంలో సహాయపడుతుంది. అంతే కాదు ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఆముదం రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు.. పెదవుల పిగ్మెంటేషన్ పోతుంది. చనిపోయిన చర్మం క్లియర్ అవుతుంది. పెదవుల పొడిబారితనం పోతుంది. పెదవులు సహజంగా తేమగా, హైడ్రేటెడ్ గా ఉంటాయి. పగిలిన పెదాలను వదిలించుకోవాలి. పెదాల నల్లని సమస్య దూరమవుతుంది. క్రమంగా పెదవులు సహజంగా గులాబీ రంగులోకి మారతాయి. పెదవుల పై ఆముదం ఎలా రాయాలి.. పెదాలను సహజంగా గులాబీ రంగులోకి మార్చడానికి మీరు నేరుగా ఆముదం నూనెను అప్లై చేయవచ్చు. దీని కోసం ఒకటి లేదా రెండు చుక్కల ఆముదం తీసుకుని, దానితో మీ పెదాలను మసాజ్ చేయండి. మీరు దీన్ని ప్రతిరోజూ ఉదయం ఇంటి నుండి బయలుదేరే ముందు, రాత్రి పడుకునే ముందు మీ పెదవుల పై రాయాలి. మీకు కావాలంటే మీరు సహజ పదార్థాల సహాయంతో ఇంట్లోనే కాస్టర్ ఆయిల్ లిప్ బామ్‌ను తయారు చేసుకోవచ్చు. దీని కోసం, ముందుగా పాన్‌లో షియా బటర్‌ను కరిగించాలి. ఆపై గ్యాస్‌ను ఆపివేయాలి. అది కరిగిన తర్వాత ఒక చెంచా ఆముదం, తేనె, మీకు నచ్చిన ఏదైనా నూనెను జోడించండి.

## వ్యాధులకు కారణం అవుతున్న టీ, బిస్కెట్..



ఉదయం అయ్యిందంటే చాలు ప్రతి ఒక్కరు టీ తాగుతుంటారు. తెల్లవారు జామునే టీ తాగనిదే కొందరికి ఆ రోజే గడవనట్లే అనిపిస్తుంది అంటుంటారు. అంటే అంత ఇష్టంగా టీ తాగుతారు. అయితే టీలో బిస్కెట్ వేసుకోవడం చాలా మందికి ఇష్టం ఉంటుంది. అందుకే చాలా మంది టీలో బిస్కెట్ వేసుకుని తింటూ ఉంటారు. కానీ టీలో బిస్కెట్ తినడం వలన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. టీలో బిస్కెట్ వేసుకొని తినడం వలన రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే బిస్కెట్‌లో సోడియం, చక్కెర అధికంగా ఉంటుంది. అందువల్ల టీలో బిస్కెట్స్ తినడం వలన బ్లడ్‌లో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. కాబట్టి థైరాయిడ్, మధుమేహం వ్యాధి గ్రస్తులు అస్సలే టీతో పాటు బిస్కెట్ తినకూడదంట. అంతే కాకుండా బిస్కెట్స్ రోజూ తినడం వలన జీర్ణ వ్యవస్థ సరిగా ఉండదంట. ఇది గుండెకు హాని చేయడం, కొలెస్ట్రాలను పెంచుతుంది. అంతే కాకుండా మలబద్ధకం వచ్చే సమస్య ఉంటుంది.

## వేసవిలో పుచ్చకాయను తెగ తినేస్తున్నారా.....



పుచ్చకాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఇందులో 90 శాతం నీరు ఉంటుంది. పుచ్చకాయ వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాకుండా వీటివల్ల ఎన్నో రకాల లాభాలు కూడా ఉన్నాయి. అయితే పుచ్చకాయలు మనకు ఎక్కువగా వేసవిలో లభిస్తూ ఉంటాయి. అందుకే వేసవి కాలంలో పుచ్చకాయను ఎక్కువగా తింటూ ఉంటారు. పుచ్చకాయ తినడం వల్ల విటమిన్స్ మినరల్స్ శరీరానికి అందుతాయి. ఇందులో ఉండే పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి. అదేవిధంగా చర్మాన్ని పొడిబారకుండా హైడ్రేట్ గా ఉండేలా చేస్తుంది. అయితే వేసవి కాలంలో పుచ్చకాయ తినడం మంచిది అని చాలామంది తెగ తినేస్తూ ఉంటారు. మరి పుచ్చకాయను ఎక్కువగా తింటే ఏం జరుగుతుంది? వేసవిలో తినడం వల్ల ఇలాంటి ప్రయోజనాలు కలుగుతాయి ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వేసవి తాపం నుంచి రక్షించే పండ్లలో పుచ్చకాయ మొదటి స్థానంలో ఉంటుంది. చల్లదనంతో పాటు, తాజాగా తినగలిగే పండు ఇది. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి. వీటి విత్తనాలు కూడా చాలా రకాల ప్రయోజనాలను చేకూరుస్తాయి. పుచ్చపండుతో పాటు గింజలను తినడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అతిదాహం, చెమట ద్వారా వచ్చే ఖనిజ లవణాల లోపాలను పుచ్చకాయ తగ్గిస్తుంది.

## తమలపాకు తులసి గింజలను కలిపి తింటే



మామూలుగా చాలామంది ఈ తమలపాకు తినే అలవాటు ఉంటుంది. ఈ తమలపాకుని పాన్ బీడా, పాన్, ఇంకా కొన్ని కొన్ని పదార్థాల ద్వారా తమలపాకులు తీసుకుంటూ ఉంటారు. తమలపాకును తినడానికి ఇష్టపడేవారు తమలపాకు, జర్దా, సున్నం కలిపి తింటే ఆరోగ్యానికి చాలా హానికరం. అయితే ప్రతి నాణేనికి రెండు వైపులా ఉన్నట్టుగానే తమలపాకు తినడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. తమలపాకు లోని ఆస్ట్రింజెంట్ ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది అనేక విధాలుగా ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలోని అనేక రకాల బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. వాతావరణంలో మార్పు కారణంగా శరీరంలో అనేక రకాల సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలలో జలుబు, దగ్గు కూడా ఒకటి. జలుబు అనేది ఒక సాధారణ అనారోగ్య సమస్య. కానీ కరోనా వైరస్ తర్వాత ఈ వ్యాధి సాధారణమైనది కాదు. అటువంటి పరిస్థితిలో తమలపాకులు, తులసి గింజలతో కలిపి తింటే చక్కటి ఫలితం ఉంటుంది. ఇది జలుబు, దగ్గు సమస్యను దూరం చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, దృఢత్వం నుండి ఉపశమనం లభిస్తుంది. ఈ తమలపాకుపాటు తులసి గింజలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా బలంగా ఉంటుంది. దీంతో పొట్ట సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. తులసి గింజలను తమలపాకులతో కలిపి తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. తమలపాకులు, తులసి గింజలు కలిపి తీసుకోవటం వల్ల చిగుళ్ల వాపు, దంతాల పసుపు నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చిగుళ్లలో వాపు, గడ్డలు, రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తాయి. చాలా సార్లు నోటి నుండి దుర్వాసన సమస్య ఉంటుంది. ఈ దుర్వాసన చాలాసార్లు బ్రష్ చేసినా, కడిగినా పోదు. అయితే తమలపాకులో తులసి గింజలు వేసి క్రమం తప్పకుండా తీసుకుంటే నోటి దుర్వాసన సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.


## బీరకాయను అవాయిడ్ చేస్తున్నారా...?



మన వంటింట్లో దొరికే కూరగాయలలో బీరకాయ కూడా ఒకటి. ఈ బీరకాయను ఉపయోగించి ఎన్నో రకాల రెసిపీలు తయారు చేస్తూ ఉంటారు.. అయితే కొందరు బీరకాయను లొట్టలు వేసుకొని తింటే, మరికొందరు అసలు బీరకాయ తినడానికి ఇష్టపడరు. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది.. కాబట్టి అత్యధిక నీటిశాతం కలిగిన బీరకాయను ఎండాకాలంలో తింటే చాలా మంచిది. మరి కేవలం ఇవి మాత్రమే కాకుండా ఎండాకాలంలో బీరకాయలు తినడం వల్ల ఇంకా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. బీరకాయ అనేది పోషకాలతో నిండిన కూరగాయ. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ కె, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు దాగున్నాయి. ఇవి మన శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా అవసరం. బీరకాయ ముఖ్యంగా తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో పాటు శక్తి వనరు. ఇది అధిక మొత్తంలో నీరు, ఫైబర్ కలిగి ఉంటుంది. ఇది ఆహారాన్ని నిల్వ చేయడంలో సహాయపడుతుంది. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల, బీరకాయ కూరగాయ బరువు నియంత్రణకు గొప్ప ఎంపికగా పరిగణిస్తారు. బీరకాయలో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది తిన్న తర్వాత, సాధారణంగా గ్యాస్ లేదా అజీర్ణం గురించి ఆందోళన ఉండదు. బీరకాయలో పెద్ద మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణిస్తారు. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక లక్షణాలు ఉన్నాయి. ఇందులో విటమిన్ ఎ, ఫైబర్ ఉన్నాయి. ఇది పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. మరి ఇన్ని ప్రయోజనాలు ఉన్న బీరకాయను అవాయిడ్ చేస్తుంటే వెంటనే తినడం మొదలు పెట్టండి.

## తులసి ఆకులని తింటే న్ని రకాల లాభాలా?

హిందూ సాంప్రదాయంలో తులసి మొక్కకు ప్రత్యేక స్థానం ఉంది. తులసి మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. తులసి మొక్క మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తులసిలో కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం, సోడియం, ఆస్కార్బిక్ ఆమ్లం, కార్బోహైడ్రేట్స్ ఉన్నాయి. వీటి వల్ల రక్త వృద్ధి, గుండెకు బలం, ఎముకలు గట్టితనం, గుండెపోటు రాకుండా గాయాలు మానేందుకు చర్మ సౌందర్యానికి అవయవాల పెరుగుదలకి ,గోర్లు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ తులసి ఆకులు ఉపయోగపడతాయి. అందుకే వైద్యులు తరచుగా తులసి కషాయం తులసి ఆకులను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. అయితే మరి పరగడుపున ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఉదయాన్నే తులసి ఆకులను నమలడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఈ రోజుల్లో కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు చాలా మంది ఉన్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోతే ప్రమాదం ఉంటుంది. అలాగే ఈ రోజుల్లో మధుమేహంతో బాధపడేవారు చాలా మంది ఉన్నారు. మధుమేహం ఉన్నవారికి కొలెస్ట్రాల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి అంటే వారు ఉదయాన్నే తులసి ఆకులను నమలడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇది డయాబెటిస్ వారికి



ఎంతో మేలు చేస్తుంది. ఇక నోటి దుర్వాసనతో బాధపడేవారు తులసి ఆకులు ఎంతగానో మేలు చేస్తాయి. నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి నోటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను తినడం వల్ల రోగ నిరోధ శక్తి పెరుగుతుంది. దీంతో మీరు అనేక తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, వ్యాధుల బారిన పడకుండా నివారించవచ్చు. అంతేకాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది. తులసి ఆకులను నమలడం వల్ల మూత్రపిండాల పనితీరు సైతం మెరుగు పడుతుంది. కిడ్నీ సంబంధిత సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. అలాగే రక్తం శుద్ధి అవుతుంది. ఇది మొటిమలు, మొటిమల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అందుకే వైద్యులు తరచుగా తులసి కషాయం తులసి ఆకులను తీసుకోవాలని చెబుతూ ఉంటారు.

## బెండకాయ వల్ల కలిగే ప్రయోజనాలు



మన వంటింట్లో దొరికే కూరగాయలలో బెండకాయ కూడా ఒకటి. బెండకాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. కొందరు బెండకాయ నువ్వు ఇష్టంగా తింటే మరికొందరు తినడానికి కూడా ఇష్టపడరు. ఇక బెండకాయతో మనం ఎన్నో రకాల రెసిపీలు ట్రై చేస్తూనే ఉంటాం. ఈ బెండకాయలు మనకు సీజన్ తో సంబంధం లేకుండా అన్ని కాలాలలో విరివిగా లభిస్తూ ఉంటాయి. బెండకాయ తింటే మధుమేహం అదుపులో ఉండటంతో పాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పోషకాలతో నిండిఉండే బెండ కాయలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. అంతేకాకుండా ఈ బెండకాయ వల్ల ఇంకా ఎన్నో రకాల అద్భుతమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వాటి గురించి తెలిస్తే తినకుండా అసలు ఉండలేరు. బెండకాయలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. అలాగే ఫైబర్ అధికంగా ఉంటుంది. బెండకాయలో ఉండే గ్లైసెమిక్ రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. బెండకాయలో ఉండే ప్రొటీన్ శరీరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రొటీన్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. తగినంత ప్రొటీన్ తీసుకుంటే అది దీర్ఘకాలం మధుమేహ నియంత్రణకు ఉపకరిస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. బెండకాయ తినడం ద్వారా శరీరంలోని ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గుతుందట. బెండకాయలోని ఫైబర్, పెక్టిన్ ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతో కీలక పాత్ర పోషిస్తాయి. ఊబకాయంతో బాధపడే వారు తరుచుగా బెండకాయ తింటే మంచిదట. బెండకాయ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందట. బెండకాయలో క్యాన్సర్ తగ్గించే ఔషధ గుణాలు ఉంటాయట. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాయి. బెండకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. గర్భంతో ఉన్న మహిళలకు ఫోలిక్ యాసిడ్ చాలా ముఖ్యమైన అంశం, బెండకాయలలో ఉండే ఫోలేట్ తల్లి, బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పలు అధ్యయనాలు వెల్లడయింది. బెండకాయ తింటే జీర్ణక్రియ శక్తి పెరుగుతుంది. బెండకాయ లోని తేమజిగురు వల్ల కొంచం తిన్న వెంటనే కడుపు నిండుతుందట. బెండకయ మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుందట. బెండకాయ ఎక్కువగా తినే వ్యక్తులు హైడ్రేటెడ్ గా ఉండటానికి ఉపయోగపడుతుంది.





# మినీ డ్రెస్‌లో ఆషు రెడ్డి పోజులు

బిగ్ బాస్ షోతో పాపులర్ అయ్యింది ఆషు రెడ్డి. సమంతలా ఉండటంతో జూ సమంతలా మరింత గుర్తింపు తెచ్చుంది. ఇప్పుడు గ్లామర్ షోతోపాటు, సినిమాలతోనూ రచ్చ చేస్తుంది. బిగ్ బాస్ బ్యూటీ ఆషు రెడ్డి మొన్నటి వరకు గ్లామర్ షోనే నమ్ముకుంది. పెద్దగా సినిమా అవకాశాలు లేకపోవడంతో అందాల ఫోటో షూట్లు చేస్తూ కాలం వెల్లదీసింది. అవకాశాల కోసం అన్వేషణ చేస్తూ వచ్చింది. దాని ఫలితం ఇప్పుడు కనిపిస్తుంది. ఆషు రెడ్డి నెమ్మదిగా సినిమా ఆఫర్లని దక్కించుకుంటుంది. “ఫోకస్” మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా మెరిసింది. పవర్‌ఫుల్ లేడీ పోలీస్ ఆఫీసర్‌గా మెప్పించింది. ఇప్పుడు బ్యాక్ టూ సినిమా ఆఫర్లని దక్కించుకుంటుంది. ప్రస్తుతం ఆమె “ఏ మాస్టర్ పీస్” అనే చిత్రంలో మరో శక్తివంతమైన పాత్ర పోషిస్తుంది ఆషు రెడ్డి. ఈ మూవీ చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. దీంతోపాటు “యేవమ్” అనే సినిమా చేస్తుంది. ఈ మూవీని ఇటీవలే ప్రకటించారు. ఇందులో ఆమె లుక్ బోల్డ్ గా ఉంది. చాలా బోల్డ్ రోల్‌లో ఈ జూ సమంత మెరవబోతుందని తెలుస్తుంది. “నా బాడీ సూపర్ డీలక్స్” అంటూ ఓ హాట్ ఫోటోని పంచుకున్నారు. ఇందులో ఆషు రెడ్డి తన బాడీని సూపర్ డీలక్స్ గా భావిస్తుందట. అలానే ఫీలవుతుందట. అలాంటి పాత్రలో కనిపించబోతుందట. అదే సమయంలో గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంది. ఆమె గ్లామర్ ఫోటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ అలరిస్తుంది. ఫ్యాన్స్ కి విజువల్ ట్రీట్ ఇస్తూనే ఉంది. ప్రస్తుతం ఆమె మినీ పర్పుల్ కలర్ డ్రెస్‌లో మెరిసింది. చైర్‌పై కూర్చొని వయ్యారంగా పోజులిచ్చింది ఆషురెడ్డి. టాప్ షో చేస్తూ ఆమె కెమెరాకి ఇచ్చిన పోజులు మతిపోయేలా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.




# రూమర్ పై స్పందించిన దేవర బ్యూటీ..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఈ భామ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తన అందం ,నటనతో బాలీవుడ్ లో ఈ భామ వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీబీజీగా వుంది. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న దేవర చిత్రంతో ఆమె టాలీవుడ్?లో ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో పల్లెటూరి అమ్మయి తంగం పాత్రను ఆమె పోషిస్తున్నారు. గ్లోబల్ స్టార్ రాంచరణ్ తో కూడా జాన్వీ కలిసి నటించనున్నారు. రాంచరణ్ బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కనున్న మూవీ “ఆర్సి 16 ” లో జాన్వీ హీరోయిన్?గా నటించనున్నారు. బాలీవుడ్?లో ఈ భామ ప్రస్తుతం మిస్టర్ అండ్ మిసెస్ మహీ, ఉల్జాతో పాటు మరో మూవీ కూడా చేస్తుంది. ఇదిలా ఉంటే శిఖర్ పహారియాతో ఆమె ప్రేమలో ఉన్నారని కొంతకాలంగా రూమర్లు వస్తున్నాయి. జాన్వీ, శిఖర్ కలిసి ఎన్నోసార్లు బయట కనిపించారు. అయితే తిరుపతిలో శిఖర్ పహారియనాను జాన్వీ కపూర్ పెళ్లి చేసుకోనున్నారనే రూమర్ తెగ వైరల్ అయింది. ఆ రూమర్ పై తాజాగా జాన్వీ స్పందించారు. జాన్వీ కపూర్ ,శిఖర్ పహారియా వివాహం తిరుపతిలో జరగనుందంటూ ఓ ఫొటోను ఓ యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం జరిగింది. అయితే దీనికి జాన్వీ స్పందించారు. ‘కుచ్ బీ’ అంటూ ఆ పోస్ట్‌కు జాన్వీ కామెంట్ చేసారు. ఏద్దైనా రాసేస్తారా అని ఆమె మండిపడ్డారు. తన పెళ్లి గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని జాన్వీ తెలిపారు.

# ఫరియా హాట్ కామెంట్స్..

జాతి రత్నాలు ఫేమ్ ఫరియా అబ్దుల్లా గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు.. ఒక్క సినిమాతోనే ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేసింది.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆ తర్వాత వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా అల్లరి నరేష్ హీరోగా తెరకెక్కిన ‘ఆ ఒక్కటి అడక్కు’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.. ఆ సినిమా మంచి హిట్ టాక్ ను సొంతం చేసుకుంది.. ప్రస్తుతం థియేటర్లలో దూసుకుపోతుంది.. ఈ సినిమా ఒకవైపు మిక్స్డ్ టాక్ ను అందుకున్నా కూడా మరోవైపు కలెక్షన్లను కురిపిస్తుంది.. ఇక ఈ సినిమా సక్సెస్ టాక్ ను అయితే అందుకుంది.. ఇదిలా ఉండగా.. ఈ ముద్దుగుమ్మ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నది.. ఈ సందర్భంగా ఎన్నో విషయాలను అందరికీ చెప్పింది.. అలాగే తనకు పెళ్లిపై హోప్ లేదు కానీ.. పిల్లలు మాత్రం కావాలంటూ చెప్పుకొచ్చింది.. ఇటీవల ఇంటర్వ్యూ లో పాల్గొన్న ఈమె మాట్లాడుతూ.. ‘నా మ్యారేజ్ పైన నాకు హోప్ కూడా లేదు. ఒకవేళ అయితే అవ్వోచ్చు. కానీ కచ్చితంగా నేను పెళ్లి చేసుకోవాలి అని అయితే నాకు లేదు. కానీ నాకు పిల్లలు అంటే మాత్రం చాలా ఇష్టం.. అయితే అమ్మ అవుతాను.. పెళ్లి గురించి ఆలోచించాలి అని చెప్పుకొచ్చింది.. అయితే తండ్రి బాధ్యతలు కూడా ఉండాలి. ఒక చైల్డ్‌ని తల్లీతండ్రి ఇద్దరు కలిసే పెంచాలి. దాంట్లో నాకు డౌట్ లేదు.. కానీ పెళ్లి అనేది ఆలోచించాలి అని చెప్పింది.. ఆ వీడియో కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవ్వడంతో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు..




# ‘ఎక్స్’లో మస్క్ ఆఫర్లు.. ఇలా ప్రీమియం ఫీచర్ల యాక్సెస్ ఫ్రీ.. కారణమిదేనా..?!

ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్ (మాజీ ట్విట్టర్)’ యూజర్లకు, ఆ సంస్థ అధినేత ఎలన్ మస్క్ తీపి కబురందించారు. 2500కి పైగా వెరిఫైడ్ ఫాలోవర్లు ఉన్న ‘ఎక్స్’ ఖాతాలకు ఉచితంగా ప్రీమియం సేవలు అందిస్తామన్నారు. 5000 మందికి పైగా ఫాలోవర్లు గల ‘ఎక్స్’ యూజర్లకు ఉచితంగా ప్రీమియం ప్లస్ సేవలు అందుబాటులోకి తెస్తామని ‘ఎక్స్ (మాజీ ట్విట్టర్)’ వేదికగా తెలిపారు. కంటెంట్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్లకు మెరుగైన ఫీచర్లు అందించడానికే ఎలన్ మస్క్ ఈ ఫెసిలిటీని కల్పించారని సమాచారం. ఇప్పటికే ‘ఎక్స్’ తన యూజర్లకు ప్రీమియం, ప్రీమియం ం ఫీచర్లు అందిస్తున్నది. యూజర్ల సబ్ సబ్ స్క్రిప్షన్ ప్లాన్ మేరకు ప్రీమియం ప్లస్ యూజర్లు ప్రకటనల్లేకుండా ‘ఎక్స్’ ఖాతా పొందడంతోపాటు పోస్ట్ చేసిన గంటలోపు సదరు ట్వీట్ ఎడిట్ చేయొచ్చు. 25 వేల అక్షరాల వరకూ పోస్ట్ చేయొచ్చు. ప్రీమియం, ప్రీమియంం సబ్ స్క్రిప్షన్ గల యూజర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ (ఎక్స్ఏఐ’ డెవలప్ చేసిన ఏఐ చాట్ బోట్ గ్రోక్(%+తీశీని%)’ను యాక్సెస్ చేయొచ్చు. ఇప్పటి వరకూ నెలకు రూ.1300 పే చేసే ప్రీమియం ప్లస్ యూజర్లకే గ్రోక్ ఫీచర్ యాక్సెస్ అవకాశం ఉండేది. ఇన్ స్టాగ్రామ్, యూ-ట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల నుంచి గట్టి పోటీ ఎదురవుతున్న నేపథ్యంలో యూజర్లను ఆకర్షించడానికి ప్రీమియం, ప్రీమియంం సబ్ స్క్రైబర్లకు ఈ ఫీచర్లను యాక్సెస్ చేసుకునే సౌకర్యం కల్పించాలని ఎలన్ మస్క్ నిర్ణయించినట్లు సమాచారం.

ఇటీవలి కాలంలో ఎక్స్ (ట్విట్టర్) వాణిజ్య ప్రకటనల ఆదాయం తగ్గుతున్నట్లు, రోజురోజుకు ‘ఎక్స్’ యూజర్లు తగ్గిపోతున్నట్లు వార్తలొచ్చిన నేపథ్యంలో ఎలన్ మస్క్ నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటికే ‘ఎక్స్’ తన యూజర్లకు ప్రీమియం, ప్రీమియం ం ఫీచర్లు అందిస్తున్నది. యూజర్ల సబ్ సబ్ స్క్రిప్షన్ ప్లాన్ మేరకు ప్రీమియం ప్లస్ యూజర్లు ప్రకటనల్లేకుండా ‘ఎక్స్’ ఖాతా పొందడంతోపాటు పోస్ట్ చేసిన గంటలోపు సదరు ట్వీట్ ఎడిట్ చేయొచ్చు. 25 వేల అక్షరాల వరకూ పోస్ట్ చేయొచ్చు.



## చిన్న టౌన్లలో వర్కర్లకు ఫుల్ గిరాకీ



**న్యూఢిల్లీ :** చిన్న పట్టణాల్లో ఉద్యోగ నియామకాలు ఊపందుకున్నాయి. వేసవి మొదలవడంతో ఏసీలు, కూలర్లు వంటి కూలింగ్ అప్లియెన్స్‌లకు డిమాండ్ పెరిగింది. ఫలితంగా కన్జూమర్ డ్యూరబుల్ కంపెనీలు పార్ట్ టైమ్ వర్కర్లను నియమించుకోవడం పెంచాయి. స్టాఫింగ్ కంపెనీలు టీమ్‌లీజ్ సర్వీసెస్, మ్యాన్‌పవర్ గ్రూప్‌ల ప్రకారం, కిందటేడాదితో పోలిస్తే ఈసారి టైర్ 2,3 సిటీల్లో హైరింగ్ యాక్టివిటీ 30 శాతం పెరిగింది. వైజాగ్, గుంటూరు, నెల్లూరు, కోయంబత్తూర్, కటక్, మదురై, పానిపట్, వారణాసి, రాయ్‌పూర్, నాగ్‌పూర్, జైపూర్, పాట్నా, కాలికట్ వంటి సిటీలలో వర్కర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పెద్ద కంపెనీలు తమ బిజినెస్‌ను విస్తరించడంపై ఫోకస్ పెట్టాయి. టైర్ 2,3 సిటీలలో తమ నెట్‌వర్క్‌ను పెంచుకుంటున్నాయి. ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్‌లు, ఇన్వర్టర్లకు డిమాండ్ బాగుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. ఏడాది కిందటితో పోలిస్తే చిన్న పట్టణాల్లో సేల్స్, సర్వీస్ జాబ్ రోల్స్‌కు డిమాండ్ 25 శాతం నుంచి 30 శాతం పెరిగింది’ అని టీమ్‌లీజ్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణియన్ అన్నారు. ఇదే టైమ్‌లో మెట్రో సిటీల్లో వర్కర్ల డిమాండ్ 15-20 శాతం పెరిగిందని పేర్కొన్నారు. కన్జూమర్ డ్యూరబుల్ ఇండస్ట్రీలో వర్కర్ల డిమాండ్ 25 శాతం (ఏడాది ప్రాతిపదికన) పెరిగిందని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ అలోక్ కుమార్ వివరించారు. మెట్రో సిటీలతో పోలిస్తే చిన్న టౌన్‌లలో ఈ డిమాండ్ కనీసం 15 శాతం ఎక్కువ ఉందని అన్నారు. సప్లయ్ చెయిన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ మెరుగవ్వడంతో పెద్ద కంపెనీలు చిన్న టౌన్‌లకు విస్తరించాలని ప్లాన్ చేస్తున్నాయన్నారు. ఇందుకోసం ఉద్యోగులు అవసరమవుతారని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 1 నుండి అత్యవసర మందుల ధరలు పెరుగుదల..!



**న్యూఢిల్లీ :** ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి కోలుకోలేకపోతోన్న సామాన్యులకు భారీ షాక్ తగలనుంది. ఏప్రిల్ 1 నుంచి పెయిన్ కిల్లర్లు, యాంటీబయోటిక్స్, యాంటీ ఇన్‌ఫెక్టివ్ వంటి అత్యవసరమైన మందుల ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ కింద ఉన్న మందుల ధరలను 0.0055 శాతం పెంచుతున్నట్లు ఎన్‌పిపిఎ వెల్లడించింది. హౌల్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా ఈ రేట్లను పెంచుతున్నట్టు ఎన్‌పిపిఎ తెలిపింది. ఇప్పటికే అత్యవసర మందుల ధరలు గత ఏడాది 10 శాతం పెరిగిన సంగతి విదితమే. 2022, 2023లో నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ (ఎన్ఎల్ఈఎం) క్రింద ఔషధాల ధరలలో రికార్డు స్థాయిలో 12 శాతం నుంచి 10 శాతం పెరిగాయి. ఆ తర్వాత ఫార్మా పరిశ్రమకు ఇది స్వల్ప పెరుగుదల. సవరించిన ధరలు జాతీయ అవసరమైన ఔషధాల జాబితాలో చేర్చబడిన 800 కంటె ఎక్కువ మందులను కవర్ చేస్తాయి.

## యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీల్లో మన అధికారులు

హైదరాబాద్: అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) మనదేశంలో నిర్వహించే ఫార్మా కంపెనీల యూనిట్ల తనిఖీల్లో స్థానిక ఔషధ నియంత్రణ అధికార వర్గాలు పాలుపంచుకోనున్నాయి. ‘అబ్జర్వ్‌డ్ ఇన్‌స్పెక్షన్ ప్రోగ్రామ్’లో 4 రాష్ట్రాల ‘స్టేట్ డ్రగ్ కంట్రోల్ అథారిటీస్’కు భాగస్వామ్యం కల్పించాలని యూఎస్ఎఫ్‌డీఏ నిర్ణయించింది. ఈ విషయాన్ని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ)కి, యూఎస్ఎఫ్‌డీఏ ఇండియా కంట్రీ డైరెక్టర్ సారా మాక్‌ముల్లెన్ వెల్లడించారు. ఇందులో తెలంగాణ, గుజరాత్, గోవా, కర్ణాటక రాష్ట్రాలున్నాయి. మనదేశంలో ఔషధ నియంత్రణ బాధ్యతలు నిర్వర్తించే సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) భాగస్వామ్యంతో ఈ రాష్ట్రాలను ఎంపిక చేసినట్లు యూఎస్ఎఫ్‌డీఏ పేర్కొంది. దీని ప్రకారం ఫార్మా కంపెనీల్లో యూఎస్ఎఫ్‌డీఏ నిర్వహించే కొన్ని రకాల ఆడిట్లు, తనిఖీల్లో రాష్ట్రాలకు చెందిన ఔషధ నియంత్రణ అధికార్లు ‘అబ్జర్వర్లు’ గా పాల్గొనే అవకాశం లభిస్తుంది. దీనివల్ల తనిఖీ వ్యవహారాల్లో ఔషధ నియంత్రణ అధికార్లకు అవగాహన పెరిగి, ప్రమాణాలను పాటించే విషయంలో ఫార్మా కంపెనీలకు మార్గదర్శకత్వం వహించగలుగుతారని సంబంధిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. యూఎస్ఎఫ్‌డీఏ ఎంపిక చేసిన అధికార్లు మాత్రమే ఇప్పటిదాకా తనిఖీలకు వస్తున్నారు. ఇందులో ఎక్కువ మంది ఇతర దేశాలకు చెందిన వారు కాగా, మనదేశం నుంచి కొద్ది మందే ఉంటున్నారు. ఎఫ్‌డీఏ తనిఖీల తీరుపై ఫార్మా కంపెనీల నిర్వాహకులకు పూర్తిస్థాయిలో అవగాహన లేనందున, తగిన విధంగా సన్నద్ధులవ్వడం లేదు. ఫలితంగా తనిఖీ బృందాలు ఫార్మా కంపెనీల యూనిట్లలో అభ్యంతరాలు గుర్తించి హెచ్చరిక లేఖలు, ఫారమ్- 483 జారీ చేస్తున్నాయి. దీనివల్ల ఆయా యూనిట్లలో మందుల ఉత్పత్తి నిలిచిపోతోంది. అమెరికాకు సంబంధిత మందులను



కొంతకాలం ఎగుమతి చేయలేక పోతున్నాయి. తనిఖీల్లో వెలుగుచూసిన అభ్యంతరాలను సవరించి.. ఆ విషయాన్ని యూఎస్ఎఫ్‌డీఏకు నివేదించి, మళ్లీ వారి తుది అనుమతి సంపాదించేందుకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు.

## ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులు..!



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ ఇటువైపు చూస్తున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో ఏకంగా రూ. 2 లక్షల కోట్ల పైగా ఇన్వెస్ట్ చేశారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. 2020-21లో ఏకంగా రూ. 2.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు ఆ మరుసటి సంవత్సరం రూ. 1.4 లక్షల కోట్లు, ఆ తర్వాత 2022-23లో రూ. 37,632 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2023-24లో భారీగా ఇన్వెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త ఆర్థిక సంవత్సరంపై కూడా అంచనాలు కాస్త సానుకూలంగానే ఉన్నాయని భారత్‌లో మజార్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ తెలిపారు. పురోగామి పాలసీ సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాల కారణంగా దేశంలోని ఎఫ్‌పీఐల ప్రవాహం స్థిరంగా కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాల కారణంగా మధ్యమధ్యలో ఒడిదుడుకులు ఉండవచ్చన్నారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు.

## కూలర్ కొనాలనుకునే వారికి గుడ్ న్యూస్.. బెస్ట్ బ్రాండ్లపై టాప్ డీల్స్.. మిస్ కాకండి



ప్రజలందరూ చల్ల గాలిని అందించే ఏసీలు, కూలర్ల వైపు చూస్తున్నారు. సాధారణంగా ఏసీల ధరలు ఎక్కువగా ఉంటాయి. కానీ కూలర్లు మాత్రం దిగువ మధ్య తరగతికి సైతం అందుబాటులో ఉంటాయి. పైగా ప్రముఖ ఈ?-కామర్స్ ప్లాట్‌ఫారం అమెజాన్‌లో భారీ డిస్కౌంట్స్ ఉన్నాయి. దాదాపు 45 శాతం తగ్గింపు ధరలో వీటిని అందజేస్తుంది అమెజాన్. ఈ నేపథ్యంలో టాప్ బడ్జెట్ ఫ్రెండ్లీ.. అధిక పనితీరు కలిగిన కూలర్లను మీకు అందిస్తున్నాం. వేసవి కాలం వచ్చేసింది. ఎండలు క్రమేపీ ముదురుతున్నాయి. ఇప్పటి వరకూ చల్లగా ఉన్న వాతావరణం మారింది. ఉక్కబోతతో ఇబ్బందులు పెరుగుతున్నాయి. ప్రజలందరూ చల్ల గాలిని అందించే ఏసీలు, కూలర్ల వైపు చూస్తున్నారు. సాధారణంగా ఏసీల ధరలు ఎక్కువగా ఉంటాయి. కానీ కూలర్లు మాత్రం దిగువ మధ్య తరగతికి సైతం అందుబాటులో ఉంటాయి. పైగా ప్రముఖ ఈ?-కామర్స్ ప్లాట్‌ఫారం అమెజాన్‌లో భారీ డిస్కౌంట్స్ ఉన్నాయి. దాదాపు 45 శాతం తగ్గింపు ధరలో వీటిని అందజేస్తుంది అమెజాన్. ఈ నేపథ్యంలో టాప్ బడ్జెట్ ఫ్రెండ్లీ.. అధిక పనితీరు కలిగిన కూలర్లను మీకు అందిస్తున్నాం. ఓ లుక్కేయండి. అన్ని రకాల కూలర్లు.. మీ ఆఫీసులో ఉపయోగించుకోవడానికి టవర్ కూలర్, మీ లివింగ్ రూమ్‌కి పవర్ ఫుల్ డిజర్ట్ కూలర్, మీ బెడ్‌రూమ్‌కి పోర్టబుల్ కూలర్ ఇలా ఏదీ కావాలన్నా అమెజాన్ లో దొరుకుతుంది. ఆ కూలర్ల వివరాలు, ధరలు, ప్రత్యేకతలను తెలుసుకుందాం.

## 2023-24 భళా.. ఈ ఆర్థిక సంవత్సరం దుమ్మురేపిన దేశీయ స్టాక్ మార్కెట్లు

### లక్షల కోట్లలో పుంజుకున్న మదుపరుల సంపద



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) దుమ్మురేపాయి. బుల్స్‌త్రో సూచీలు సరికొత్త శిఖరాలను అధిరోహించగా, మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఎగబాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ట్రేడింగ్‌కు చివరిరోజైన గురువారం కూడా మార్కెట్లు పరుగులు పెట్టాయి. దీంతో ఘనంగా వీడ్కోలు పలికినట్లైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 655.04 పాయింట్లు లేదా 0.90 శాతం పెరిగి 73,651.35 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 1,194 పాయింట్లు పెరగడం విశేషం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 203.25 పాయింట్లు లేదా 0.92 శాతం ఎగిసి 22,326.90 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 819.41 పాయింట్లు లేదా 1.12 శాతం, నిఫ్టీ 230.15 పాయింట్లు లేదా 1.04 శాతం అందిపుచ్చుకున్నాయి. మదుపరులలో కొనుగోళ్ల ఉత్సాహం తొణికిసలాడింది. పవర్, క్యాపిటల్ గూడ్స్, యుటిలిటీస్, ఆటో, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, కమాడిటీస్, టెలీకమ్యూనికేషన్స్, మెటల్ షేర్లు ఆకట్టుకోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. గ్లోబల్ స్టాక్ మార్కెట్లలో బుల్లిష్ ట్రెండ్ కూడా కలిసొచ్చినట్టు మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫిన్‌సర్వ్ దాదాపు 4 శాతం లాభపడింది. నెస్లే, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లూ పుంజుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.33 శాతం ఎగిశాయి. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ లాభాల్లో ఉంటే, జపాన్, దక్షిణ కొరియా నష్టపోయాయి. బీఎస్ఈ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల సంపద ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,28,77,203.77 కోట్లు ఎగిసి రూ.3,86,97,099.77 కోట్లను చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23) రూ. 5,86,605.38 కోట్లే పెరిగింది.

# సిబ్బంది లాంగ్ సిక్‌లీవ్... 80 విమానాలను రద్దు చేసిన ఎయిర్ ఇండియా




న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది నిర్వాకంతో80 కి పైగా విమానాలు రద్దయ్యాయి. క్యాబిన్ సిబ్బంది అకస్మాత్తుగా సిక్‌లీవ్ పెట్టడంతో విమానాలను రద్దు చేసినట్టు ఎయిరిండియా బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. మంగళవారం రాత్రి నుంచి తమ సిబ్బందిలో కొందరు అస్వస్థతకు గురైయ్యారని తెలిపింది. దీంతో విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయని, 80 కి పైగా విమానాలను రద్దు చేశామని తెలియజేసింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, వారికి డబ్బులు తిరిగి ఇవ్వడం కానీ, విమానాలు రీ షెడ్యూల్ చేస్తామని వివరించింది. మే 8న ప్రయాణాలు షెడ్యూల్ చేసుకున్న ప్రయాణికులు తాము ఇంటి నుంచి బయల్దేరే ముందే తమ విమానం క్యాన్సల్ అయిందో లేదోనిర్ధారించుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా, విమానాల రద్దుపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ విమర్శలు చేసింది. సంస్థ నిర్వహణ బాగోలేదని, సిబ్బంది మధ్య వివక్ష సాధారణమై పోయిందని ఆరోపించింది. విస్తారా ఎయిర్‌లైన్స్ విలీనంపై కూడా సిబ్బంది అసంతృప్తితోఉన్నారు. ప్రయాణికులు తీవ్ర అసంతృప్తితో సోషల్ మీడియాలో ఫిర్యాదు చేశారు.

# భారతి.... అలా జరగాలంటే... మిగిలిన వారిని గొడ్డలితో నరికేయండి: షర్మిల



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీంతో జగన్ వర్సెస్ షర్మిల మధ్య పొలిటికల్ వార్ నడుస్తోందని రాజకీయ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. సిఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై షర్మిల ఘాటు విమర్శలు చేశారు. లోక్ సభ, ఎపి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆమె రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేపట్టారు. ఎప్పుడు ఒక్కరే కడపలో గెలవాలనేది వైఎస్ భారతి ప్లాన్ అయి ఉంటుందని, మిగితా వాళ్లను గొడ్డలితో నరికేయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. కడప వైఎస్ఆర్‌సిపి ఎంపి అభ్యర్థి అవినాష్ రెడ్డి దేశం విడిచి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని షర్మిల ఆరోపణలు చేశారు. వైఎస్ఆర్‌సిపి ఓడిపోతే అవినాష్ రెడ్డి అరెస్టు ఖాయమని, భయంతోనే అతడు పాస్‌పోర్టులు రెడీ చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. కడపలో అవినాష్ రెడ్డి గెలిస్తే నేరం గెలిచినట్లేనని తెలిపారు. కడప ప్రజలకు అందుబాటులో ఉంటానని, తనకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు.

## మాజీ గవర్నర్ తమిళి సై పై...

# ఈసీకి బిఆర్ఎస్ ఫిర్యాదు



హైదరాబాద్: మాజీ గవర్నర్ తమిళి సై సౌందరాజన్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను బిఆర్ఎస్ కోరింది. ఈసీకి బీఆర్ఎస్ పార్టీ బుధవారం ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే కాలనీలో తమిళిసై ఎన్నికల ప్రచారం చేశారని, ఆ సమయంలో ఓటర్లకు అయోధ్య రామమందిర నమూనాలను పంపిణీ చేశారన్నారు. ఇది ఎన్నికల నియమావళిని (మోడల్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఆమెపై ఆర్టికల్ 324 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చూడాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రామ మందిర నమూనాలను పంపిణీ చేస్తున్న ఫొటోలను కూడా ఈసీకి అందజేసినట్లు తెలిపారు. అలాగే తమిళిసై పై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లోనూ బీఆర్ఎస్ లీగల్ టీం ఫిర్యాదు చేసింది. చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ టీం సభ్యులు లలిత, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ గంగా, సదానందం, కార్తీక్ పాల్గొన్నారు.

# దలైలామాకు పివి నరసింహారావు మెమోరియల్ అవార్డు




భారత మాజీ ప్రధాని భారతరత్న దివంగత పివి నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక పివి నరసింహారావు మెమోరియల్ అవార్డును ప్రపంచ శాంతి దూత దలైలామాకు అందజేశారు. ధర్మశాలలోని దలైలామా నివాసంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. పివి ఫౌండేషన్ అధ్యక్షులు, ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ ఛైర్మన్ మణీందర్ జీత్ సింగ్ బిట్టా, పివి మనుమడు పివిఆర్ కశ్యప్, హైదరాబాద్‌కు చెందిన సివిల్ సర్వీసెస్ ర్యాంకర్, సిఎస్‌బి ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత మల్లవరపు, పివి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివంగత పివి స్మారక అవార్డును అందుకుంటున్నందుకు దలైలామా హర్షం వ్యక్తం చేశారు. శాంతి ద్వారానే ప్రపంచం మనుగడ సాగించగలదని దలైలామా పేర్కొన్నారు. భారతరత్న పివి ప్రపంచశాంతి కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. పివి అడుగుజాడలలో నడవాల్సిన అవసరం వుందని బిట్టా, బాలలత మలిలవరపు ఆ సందర్భంగా అన్నారు. పివి మెమోరియల్ ఈ అవార్డును గతంలో సబర్మతి ఆశ్రమంకు, రతన్ టాటాకు అందజేసింది. మూడవసారి దలైలామాకు ఇచ్చామని పివిఆర్ కశ్యప్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తెలిపారు.

# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ షాక్... కీలక ఆయుధ సరఫరా నిలిపివేత



వాషింగ్టన్: అమెరికా మాటలను పెడచెవిన పెట్టి గాజాలోకి చొచ్చుకెళ్తున్న ఇజ్రాయెల్ కు ఓ షాక్ ఎదురైంది. వాషింగ్టన్ నుంచి అందాల్సిన కేలక ఆయుధాల షిప్‌మెంట్‌ను నిలిపివేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కోటి 900 కిలోల బరువు ఉండే 1800 బాంబులు, 226 కిలోల బరువు ఉండే మరో 1700 బాంబులు ఇప్పుడు టెల్‌అవీవ్‌కు అందవు. ఈ విషయాన్ని బైడెన్ కార్యవర్గం లోని కీలక అధికారి ధ్రువీకరించారు. రఫాలో పౌరుల భద్రత, వారికి మానవీయ సాయంపై అమెరికా ఆందోళనలు పట్టించుకోని నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రఫాలో దాదాపు 10 లక్షల మందికి పైగా తలదాచుకొంటున్నారు. ఈ నేపథ్యంలో రఫాలో భారీ ఆపరేషన్లు చేపట్టకూడదని, ఆ ప్రాంతం లోకి మానవీయ సాయం పంపించేందుకు మార్గాలను అన్వేషించడానికి వీలుగా చర్చలు జరుపుతున్నాం.

# దేశం లోనే తొలి ప్రైవేట్ రైలు జూన్ 4 నుంచి




దేశం లోనే తొలి ప్రైవేట్ రైలు సర్వీస్ జూన్ 4 నుంచి కేరళ లోని తిరువనంతపురం నుంచి గోవా మార్గంలో రాకపోకలు ప్రారంభించనున్నది. ఎస్ఆర్ఎంపీఆర్ గ్లోబల్ రైల్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ రైలు సర్వీస్‌ను నిర్వహించనున్నది. ఈ రైలు ప్రధాన లక్షం పర్యాటకులను ఆకర్షించడం. భారత్ గౌరవ్ యాత్ర ప్రాజెక్టులో భాగంగా భారతీయ రైల్వే, ప్రిన్సి వరల్డ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త సహకారంతోఈ ప్రైవేట్ రైలు సర్వీస్‌ను నిర్వహించనున్నారు. తిరువనంతపురం నుంచి గోవామార్గంలో త్రివేంద్రం, కొల్లం, కొట్టాయం, ఎర్నాకులం, త్రిస్సూర్, కోజికోడ్, కన్నూర్, కాసర్‌గోడ్ సహా పలు స్టేషన్లలో రైలును ఆపుతారు. ఇందులో ఏకకాలం 750 మంది ప్రయాణం చేయవచ్చు. 2 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 11 థర్డ్‌క్లాస్ ఏసీ కోచ్‌లు, 2 సెకండ్ క్లాస్ ఏసీ కోచ్‌లు ఉన్నాయి. వైద్య నిపుణులు సహా మొత్తం 60 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు. భోజన వసతి, వైఫై సదుపాయం, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ అందుబాటులో ఉంటాయి. స్టార్ హోటల్ వసతి భోజన సదుపాయంతోపాటు ప్రముఖ పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం కల్పించే టూర్ ప్యాకేజీలను కూడా అందించనున్నారు.

# బిజెడిలో చీలికకు బిజెపి కుట్ర: ఒడిశా బిజెడి నేత



భువనేశ్వర్: గెలుపు కోసం ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష బిజెపి పోటీ చేయడం లేదని, ఎన్నికల తర్వాత బిజూ జనతాదళ్(బిజెడి)ని ముక్కలు చేసే ఉద్దేశంతోనే తన సీట్ల సంఖ్యను పెంచుకోవాలని ఆ పార్టీ పోటీ చేస్తోందని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సన్నిహిత సహచరుడు, బిజెడి నాయకుడు వికె పాండ్యన్ బుధవారం ఆరోపించారు. గంజాం జిల్లాలోని గోపాల్‌పూర్‌లో కొందరు టెలివిజన్ జర్నలిస్టులతో మాజీ బ్యూరోక్రాట్ పాండ్యన్ మాట్లాడుతూ 120 అసెంబ్లీ సీట్లను గెలుచుకోవాలని 2014లో ప్రయత్నించి బిజెపి విఫలమైందని తెలిపారు. 2019లో వారి లక్షం తనకు తెలియనప్పటికీ 2024 ఎన్నికల్లో మాత్రం 50 నుంచి 60 సీట్లు గెలుచుకుని బిజెడిలో చీలికలు తేవాలన్నది వారి ఆలోచనని ఆయన చెప్పారు. ఇదే వారి ఎన్నికల వ్యూహమని పాండియన్ అన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, మధ్య ప్రదేశ్‌లో కూడా బిజెపి ఇదే పని చేసిందని ఆయన చెప్పారు. అయితే బిజెపి కుట్ర ఫలించబోదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం కోసం జాతీయ స్థాయి నుంచి చాలా మంది వస్తున్నారని, కాని వారిపై ఒడిశా ప్రజలలో నమ్మకం లేదని, ప్రజలు కేవలం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను మాత్రమే నమ్ముతారని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కూడా ప్రజల ఆశీస్సులు నవీన్ పట్నాయక్‌కే ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వరుసగా ఆరవసారి నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారన్న గట్టి విశ్వాసం తనకు ఉందని ఆయన తెలిపారు. ఆ నమ్మకం ఉన్నందువల్లే జూన్ 9న నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని తాను చెప్పగలిగానని ఆయన తెలిపారు. ఒడిశాలోని మొత్తం 147 అసెంబ్లీ స్థానాలలో 60 స్థానాలలో బిజెపికి అభ్యర్థులే లేరని పాండ్యన్ చెప్పారు. తమ పార్టీ తప్పించిన లేదా తిరస్కరించిన నాయకులను తీసుకోవడం కోసం జెడిఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా కోసం బిజెపి ఎదురుచూసిందని ఆయన చెప్పారు. ఇదే ఒడిశాలో బిజెపి వాస్తవ పరిస్థితని ఆయన వ్యాఖ్యానించారు.

# విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వండి: ఎపి సిఎం జగన్



అమరావతి: ఎపి సిఎం జగన్ త్వరలోనే బ్రిటన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాలకు వెళ్లనున్నారు. ఈ మేరకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఆయన హైదరాబాదులోని సిబిఐ కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అక్రమాస్తుల అభియోగాల నేపథ్యంలో సిఎం జగన్ పై అనేక సిబిఐ కేసులు ఉండడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన షరతులతో కూడిన బెయిల్‌పై బయట ఉన్నారు. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్ల రాదని కోర్టు బెయిల్ షరతుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో, తాను విదేశాలకు వెళ్లేందుకు వీలుగా బెయిల్ నిబంధనలు సడలించాలని సిబిఐ కోర్టును కోరారు. సిఎం జగన్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన నాంపల్లి సిబిఐ న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలంటూ సిబిఐని ఆదేశిం చింది. అనంతరం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కాగా, ఈ నెల 17 నుంచి జూన్ 1 మధ్యన తాను విదేశాలకు వెళ్లాల్సి ఉందని సిఎం జగన్ తన దరఖాస్తులో పేర్కొన్నారు.

# అధికారులు అలర్ట్ గా ఉండాలి.. రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు.. డీఎస్ చౌహాన్



కరీంనగర్ : అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని, వారం రోజులపాటు అధికారులంతా అలర్ట్ గా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టం జరగకుండా చూడాలని సూచించారు. బుధవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా ధాన్యానికి సంబంధించిన తేమ శాతాన్ని పర్యవేక్షించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేంద్రానికి వచ్చింది.. డబ్బులు రైతుల అకౌంట్లో జమ అయ్యాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులతోనూ మాట్లాడారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయా అని అక్కడికి వచ్చిన రైతులను అడిగి తెలుసుకున్నారు. మూడు, నాలుగు రోజుల్లోనే బ్యాంక్ ఖాతాలో జమవుతున్నాయని రైతులు కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ ను తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ప్రతి రైతుకు సంబంధించిన సెల్ నంబర్ ను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నిబంధనను కచ్చితంగా అధికారులు, సిబ్బంది పాటించాలని సూచించారు. దీంతో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సరిగా తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. తరుగు పేరిట మిల్లర్లు రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని పేర్కొన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. టర్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అధికారులు తరచూ కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, ఇన్చార్జి డిఎస్ఓ సురేష్ రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీఓ రామానుజ చార్య, డీఆర్డిఓ శ్రీధర్, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com